# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 285 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శుక్రవారం 05 డిసెంబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 285 05-12-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్...

### 18 మంది మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం

**ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భీకర కాల్పులు**

**ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు కూడా వీరమరణం**

**ఘటనా స్థలం నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం**



ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలతో బుధవారం జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో 18 మంది మావోయిస్టులు

- తరువాయి 2లో..

## నా మిత్రుడు పుతిన్‌కు స్వాగతం పలకడం ఎంతో ఆనందంగా ఉంది: ప్రధాని మోదీ

- రెండ్రోజుల పర్యటన కోసం భారత్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్
- విమానాశ్రయంలోనే పుతిన్‌కు స్వయంగా స్వాగతం పలికిన ప్రధాని మోదీ
- 23వ భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొననున్న ఇరువురు నేతలు
- రక్షణ, వాణిజ్యం, ఇంధన రంగాలపై కీలక ఒప్పందాల రూపకల్పన
- కాలపరీక్షకు నిలిచిన మన స్నేహబంధం అంటూ మోదీ ట్వీట్



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల కీలక పర్యటన కోసం గురువారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. ఈ పర్యటనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి పుతిన్‌కు సాదరంగా స్వాగతం పలికారు. ఇద్దరు నేతలు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని, ఒకరినొకరు పలకరించుకున్నారు. అనంతరం ఒకే వాహనంలో విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లడం ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన స్నేహబంధానికి నిదర్శనంగా నిలిచింది. ఈ ప్రత్యేక స్వాగతంపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "నా మిత్రుడు, అధ్యక్షుడు పుతిన్‌కు స్వాగతం పలకడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనతో జరగబోయే సమావేశాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. భారత్-రష్యా స్నేహం కాలపరీక్షకు నిలిచింది, ఇది మన ప్రజలకు ఎంతో మేలు చేసింది" అని పేర్కొన్నారు. గురువారం రాత్రి ప్రధాని మోదీ తన అధికారిక నివాసమైన లోక్ కల్యాణ్ మార్గ్‌లో పుతిన్‌కు ప్రైవేట్ విందు ఏర్పాటు చేశారు. గత ఏడాది మాస్కో పర్యటనలో పుతిన్ కూడా మోదీకి ఇదే తరహాలో ఆతిథ్యం ఇచ్చారు. 2022లో ఉక్రెయిన్‌తో



- తరువాయి 2లో..

## శంకుస్థాపన బాటలో సగానికి పైగా ఎంఓయూలు

- ప్రాసెస్ లోకి వచ్చిన రూ.7.69 లక్షల కోట్ల పెట్టుబడులు
- 45 రోజుల్లోగా మెజార్టీ ఎంఓయూలు గ్రౌండింగ్ కావాలి
- డ్వాక్రా మహిళల ద్వారా పశువుల దాణా తయారీ పరిశ్రమలు
- క్వాంటం వ్యాలీకి సలహా మండలి నియమించండి
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్లే ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయి
- 13వ ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ. 20,444 కోట్ల పెట్టుబడులకు... 56,278 ఉద్యోగాలకు ఎస్ఐపీబీ ఆమోదం



విజయవాడ డిశెంబర్ 4:(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల్లో 50 శాతానికి పైగా ఆమోద ప్రక్రియలోకి వచ్చాయని, 45 రోజుల్లోగా వీటికి శంకుస్థాపన జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం సచివాలయంలో 13వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం జరిగింది. ఇందులో రూ. 20,444 కోట్ల విలువైన పెట్టుబడులకు 13వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. దీంతో 56,278 మందికి ఉద్యోగావకాశాలు వస్తాయి. ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న 6 కంపెనీలకు కూడా ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. అలాగే విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 'ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని చూసే ప్రముఖ సంస్థలు పెద్దఎత్తున ఏపీకి వస్తున్నాయి. కంపెనీలు స్థాపించడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఆయా కంపెనీలకు అవసరమైన నీరు, విద్యుత్, భూమి వంటి సౌకర్యాలను కల్పిస్తున్నాం. వాటి విషయంలో పారదర్శకత పాటిస్తుండడం వల్లనే ప్రాజెక్టులు ఏపీకి వస్తున్నాయి. గత పాలకులు సింగపూర్ లాంటి దేశాన్నే ఇబ్బందులు పెట్టారు. ఆ దేశ కంపెనీలను ఇబ్బంది పెట్టారు. అలాంటి పరిస్థితులుంటే రాష్ట్రానికి పెట్టుబడులు రావు. అంతర్జాతీయ స్థాయిలో చెడ్డ పేరు వస్తుంది. మనం ఆ బ్యాడ్ ఇమేజ్‌ని


- తరువాయి 2లో..



## స్క్రబ్ టైఫస్ చికిత్సకు సంబంధించిన మందులు సిద్ధం!

**ల్యాబ్స్ ల్లో పరీక్షలు పెంచేందుకు చర్యలు!**

**రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడి**



అమరావతి, డిసెంబర్ 4:(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

స్క్రబ్ టైఫస్ జ్వరాలవల్ల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు. ఇందుకు ప్రధానంగా అవసరమైన డాక్సిసైక్లిన్, అజిత్రోమైసిన్ మాత్రలు కోటి చొప్పున ఉప ఆరోగ్య కేంద్రాల(హెల్త్ అండ్ వెల్నెస్) స్థాయిలోనే అందుబాటులోనే ఉన్నాయని తెలిపారు. విజయవాడలో గురువారం సాయంత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరైన కమిషనర్ వీరపాండియన్

- తరువాయి 2లో..

## రెండో రోజు ఉద్భవ్-2025లో మెరిసిన గిరిజన చిన్నారులు


- క్విజ్, మిమిక్రీ, శ్లోకాలు, నృత్య, సంగీత పోటీలలో విద్యార్థుల ప్రతిభలి
- 49 ఈవెంట్లలో ఇప్పటివరకు 29 ఈవెంట్లు పూర్తిలి
- తొలి రోజు పతకాలలో త్రిపుర, సిక్కిం, ఏపీ,ఒడిశా రాష్ట్రాల హవాలి
- శుక్రవారం తేలనున్న అన్ని విభాగాల తుది ఫలితాలులి
- శాస్త్రీయ సంగీతం, ఆశుకవిత్వం విభాగాలలో ఏపీకి పసిడి
- దేశభక్తి గ్రూప్ సాంగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ కు రెండో స్థానం
- 22 పతకాలతో ఒడిషాకు తొలి స్థానం, 20 పతకాలతో తెలంగాణ రెండో స్థానం
- మొత్తం 11 పతకాలు సాధించి ఐదో స్థానంలో ఉన్న ఆతిథ్య ఆంధ్రప్రదేశ్



అమరావతి, డిసెంబర్ 4:(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గిరిజన విద్యార్థుల నైపుణ్యాల్ని వెలికితీయడమే ఉద్దేశంగా నిర్వహిస్తోన్న ఉద్భవ్-2025 సాంస్కృతిక ఉత్సవాలలో విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. కేఎల్ యూనివర్శిటీ వద్ద చిన్నారులు ప్రదర్శించే కళలతో సందడి వాతావరణం నెలకొంది. తొలి రోజు నిర్వహించిన పోటీల

- తరువాయి 2లో..




## పార్లమెంటులో హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లుపై వాడివేడీగా చర్చ



న్యూఢిల్లీ : ఈరోజు లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025ను ప్రవేశపెట్టారు. రెండు ప్రయోజనాల రీత్యా కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఒకటి ఆరోగ్య భద్రత, రెండు జాతీయ భద్రత ఈ రెండు అంశాలపై ఈ బిల్లును రూపొందించినట్లు సీతారామన్ అన్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే వస్తువులపైనే ఉదాహరణకు పాన్ మసాలా వంటి వస్తువులపై పన్ను విధించబడుతుందని ఈ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్మలాసీతారామన్ స్పష్టం చేశారు. కాగా, ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపీలు

- తరువాయి 2లో..

## శరవేగంగా రాజధాని అమరావతి నిర్మాణ పనులు

అమరావతి, డిసెంబర్ 4:(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గవర్నర్ బంగళా లోక్ భవన్, ఇతర సముదాయాల నిర్మాణానికి రూ. 169 కోట్లు కేటాయించడం జరిగిందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ శాఖామాత్యులు పొంగూరు నారాయణ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ 55వ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి నారాయణ ఏపీ సచివాలయంలోని ప్రచారవిభాగంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ లోక్ భవన్, ఇతర భవన



సముదాయాలతో పాటు జ్యూడిషియల్ అకాడమి నిర్మాణాలకు అడ్మినిస్ట్రేటివ శాంక్షన్

- తరువాయి 2లో..

## కూటమి నాయకుల ఐక్యతే రాష్ట్రాభివృద్ధికి మూలం



అమరావతి, డిసెంబర్ 4:(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

"వర్షించని మేఘం... శ్రమించని మేధావి" ఉన్నా, లేకపోయినా ఒక్కటే. అలాగే కూటమి ప్రభుత్వానికి ఇంత బలం ఉండి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవస్థల్లో మార్పులు తీసుకురాకపోతే మనకు ఎన్ని పదవులు ఉన్నా నిష్ప్రయోజనమే అని ఉప ముఖ్యమంత్రివర్యులు, జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు

- తరువాయి 2లో..

- 15 ఏళ్లు ఇదే స్ఫూర్తి కొనసాగితే అభివృద్ధి సుస్థిరమవుతుంది
- వైసీపీ పాలనలో దిగజారిన వ్యవస్థలను తిరిగి నిలబెడుతున్నాం
- క్షేత్రస్థాయిలో ప్రజల గొంతుకగా మారుదాం
- చిన్న చిన్న కమ్యూనికేషన్ గ్యాప్స్ ఉంటే కలిసి మాట్లాడుకుందాం
- చిత్తూరులో కూటమి పార్టీల నాయకులతో ప్రత్యేకంగా సమావేశమైన ఉప ముఖ్యమంత్రివర్యులు, జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్





## చంద్రబాబుకు దేవుడంటే భయం, భక్తి లేవు: జగన్

**తిరుమల లడ్డూపై సీఎం చంద్రబాబుది దుష్ప్రచారం అంటూ జగన్ ఫైర్**

**కల్తీ నెయ్యి ట్యాంకర్లు లోపలికి వెళ్లాయా అని సూటి ప్రశ్న**

**కఠిన తనిఖీల తర్వాతే టీటీడీలోకి నెయ్యి ట్యాంకర్లు అనుమతిస్తారని వెల్లడి**

**దేవుడిని రాజకీయాల్లోకి లాగుతున్నారని విమర్శ**

అమరావతి, డిసెంబర్ 4:(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని వైసీపీ అధినేత జగన్ స్పష్టం చేశారు. దీనిని పూర్తిగా దుష్ప్రచారంగా అభివర్ణించిన ఆయన, దేవుడిని కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారని మండిపడ్డారు. దేవుడంటే

- తరువాయి 2లో..

## తెలుగుదేశంలో వ్యక్తులు శాశ్వతం కాదు... పార్టీ శాశ్వతం!



- చట్టబద్ధమైన పనుల కోసం కేడర్ వెళితే అధికారులు స్పందించాలి
- అధికారంలోకి రావడం వెనుక కార్యకర్తల కష్టం దాగి ఉంది
- హుండీలో రూ.50కోట్లు కొట్టేస్తే సైకో దృష్టిలో చిన్న దొంగతనమా?
- పాలకొండ టిడిపి కార్యకర్తల సమావేశంలో యువనేతలోకేష్

పాలకొండ, డిసెంబర్ 4:(తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పాలకొండ: తెలుగుదేశంలో వ్యక్తులు శాశ్వతం కాదు, పార్టీ శాశ్వతమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. పాలకొండ నియోజకవర్గం భామిని కార్యకర్తలను ఉద్దేశించి యువనేత లోకేష్ ప్రసంగించారు. తొలుత పార్టీ వ్యవస్థాపకుడు అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



అనంతరం యువనేత లోకేష్

- తరువాయి 2లో..



### నా మిత్రుడు పుతిన్‌కు స్వాగతం పలకడం ఎంతో ఆనందంగా ఉంది: ప్రధాని మోదీ

యుద్ధం ప్రారంభమైన తర్వాత పుతిన్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. ఈ పర్యటన నేపథ్యంలో ఢిల్లీ వీధులన్నీ పుతిన్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన బ్యానర్లతో నిండిపోయాయి. శుక్రవారం జరగనున్న 23వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశం ఇరు దేశాల మధ్య సంబంధాలలో అత్యంత కీలకమైనది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో జరుగుతున్న ఈ సమావేశంలో రక్షణ సహకారాన్ని బలోపేతం చేసుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. దీంతో పాటు వాణిజ్యం, ఇంధన భాగస్వామ్యం, శాస్త్ర సాంకేతిక రంగాలపై కూడా విస్తృతంగా చర్చించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా పలు కీలక ఒప్పందాలపై సంతకాలు జరగనున్నాయి. ఈ పర్యటన ఇరు దేశాల 'ప్రత్యేక మరియు విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## శంకుస్థాపన బాటలో సగానికి పైగా ఎంఓయూలు

చెరిపేసి... ఏపీకి బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చాం. అందుకే ఇటీవల మనం నిర్వహించిన పెట్టుబడుల సదస్సుకు మంచి స్పందన వచ్చింది.' అని సీఎం అభిప్రాయపడ్డారు.

**20 రోజుల్లోనే ఆచరణ దిశగా...**

'20 రోజుల క్రితం విశాఖ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తే... ఇప్పటికే రూ.7.69 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు ఆచరణ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ ఎంఓయూలు అన్నింటికీ ఏయే జిల్లాల్లో ఏర్పాటు చేయాలి... ఎక్కడెక్కడ భూములివ్వాలనే అంశంపైనా నిర్ణయాలు జరిగాయి. ఇక మిగిలిన ఎంఓయూలను వీలైనంత త్వరగా పట్టాలెక్కించాలి. 45 రోజుల్లోగా ఎంఓయూలు అన్నింటినీ గ్రౌండింగ్ అయ్యేలా చూడాలి. వీలైనన్ని ఎంఓయూలను గ్రౌండింగ్ చేసి... దావోస్ సదస్సుకు వెళ్తే మరిన్ని పెట్టుబడులను వస్తాయి. త్వరితగతిన ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాలి. దావోస్ పర్యటనకు ముందే 75 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన జరిగేలా చూడాలి. ఎంఓయూల గ్రౌండింగ్‌పై ప్రతీ వారం సీఎస్ సమీక్షించాలి. ఇక నుంచి ఎస్ఐపీబీతో పాటు ఎంఓయూలపైనా స్వయంగా సమీక్షిస్తాను. జిల్లా కలెక్టర్లు కూడా వీటిపై దృష్టి పెట్టాలి. ఇక పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యే విధానానికి సంబంధించి ఓ విధానాన్ని రూపొందించండి. ఆ విధానాన్ని కెబినెట్లో ఆమోదిద్దాం. ముఖ్యమంత్రి, మంత్రి వర్గ ఉప సంఘం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా ఆయా శాఖలకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులతో మోనిటరింగ్ రివ్యూ మెకానిజం ఏర్పాటు చేసుకుందాం. ఇక భూసేకరణలో ఎక్కడా వివాదాలు రాకుండా చూడాలి. భూములకు సంబంధించి ఒక్క ఫిర్యాదు రాకూడదు. భూములు తీసుకున్న వాళ్లు ఎంతో సంతోషంగా ఉంటారో... ఇచ్చిన వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ప్రభుత్వ యంత్రాంగం కూడా నైపుణ్యాలు పెంచుకోవాలి**

"ఆమోదం పొందిన యూనిట్లు, పరిశ్రమలు నిర్దేశిత గడువులోగా ఏర్పాటు చేయాల్సిందే. దీనిపై అధికారులు ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలి. వివిధ రంగాల్లో ఏపీని అభివృద్ధి చేయాలని చూస్తున్నాం. అలాగే రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈక్రమంలో ప్రభుత్వ యంత్రాంగం కూడా పూర్తిగా టెక్నాలజీపై గ్రిప్ పెంచుకోవాలి. లేకుంటే మనం వెనుకబడిపోతాం. ఇదే కాకుండా... భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలోని యువతను సిద్ధం చేయాలి. ఈ మేరకు వివిధ రంగాల్లో వారిని నైపుణ్యాలు అందించేలా చూడాలి. లాజిస్టిక్స్ యూనివర్సిటీ, సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ, గ్రీన్ ఎనర్జీ యూనివర్సిటీ వంటివి ఏర్పాటు చేయాలి. క్వాంటం వ్యాలీకి అడ్వైజరీ బాడీని నియమించండి. మెంటరింగ్, మోనిటరింగ్, వెంచర్ క్యాపిటల్ కోసం ఇది పనిచేయాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అనేది స్టార్టప్‌లకు ఓ మెంటార్ గా వ్యవహరిస్తుంది. క్వాంటం వ్యాలీలో నిర్మించే 6 క్వాంటం టవర్లలో రెండు టవర్లను క్వాంటం అల్గారిథం డెవలప్మెంట్ కోసం... మరో రెండు టవర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్మెంట్ కోసం కేటాయించండి. ఏఐ బేసిక్స్‌ను 7 తరగతి నుంచే బోధించేలా చర్యలు చేపట్టండి. మైక్రోసాఫ్ట్, గుగూల్ లాంటి కంపెనీల సాయంతో బృందాన్ని ఏర్పాటు చేయండి. పర్యాటక కేంద్రాలకు ప్రచారం కల్పించండి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఆతిధ్య రంగంలోనూ, పర్యాటక రంగంలోనూ రావాలి. విశాఖ కాపులుప్పాడలో హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల కోసం 50 ఎకరాలు కేటాయించండి. దీనికి అవసరమైన మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. ప్రాజెక్టు స్థాయిని బట్టే ప్రోత్సాహకాలు అందాలి. లార్జ్, మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులుగా వర్గీకరించాలి. మనం ఇచ్చే ప్రోత్సాహకాలు ఎస్క్రో ఖాతాకు జమ చేసే విధానాన్ని అమల్లోకి తీసుకురావాలి."అని సీఎం సూచించారు.

**సావరిన్ ఫండ్ ఏర్పాటు చేద్దాం...**

"ప్రభుత్వ రంగ సంస్థలే వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేలా చర్యలు తీసుకోవాలి. యూఏఈ, దుబాయ్, సహా మరికొన్ని దేశాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు లక్షల కోట్ల రూపాయలతో సావరిన్ ఫండ్ ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో ప్రభుత్వ కంపెనీలతోనే వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ఏపీ కూడా ఆ స్థాయికి రావాలి. రూ.500 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం సావరిన్ ఫండ్ ఏర్పాటు చేయాలి. ఇక ఎర్లీబర్డ్ ప్రోత్సాహకాల అవకాశాలను మిగతా వారికి కూడా అందించేలా అన్ని శాఖలూ చూడాలి. ఈ మేరకు ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాలపై వెసులుబాటు కల్పించేలా పాలసీని సడలించండి. లైవ్ స్టాక్ పరిశ్రమ రూ. 8 లక్షల కోట్లకు చేరాలన్నదే మన లక్ష్యం. ఆ దిశగా మార్గదర్శకాలు రూపొందించండి. పశువుల మేతను డ్వాక్రా సంఘాల ద్వారా తయారు చేయగలిగితే వారికి మంచి ఆదాయ మార్గం అవుతుంది. నరేగా ద్వారా వాటిని ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుంది. 9 జిల్లాలను హార్టీ కల్చర్ హబ్ గా తయారు చేస్తున్నాం. దీంట్లో భాగంగా పూర్వోదయ స్కీం కింద కేంద్రం రూ. 40 వేల కోట్లు ఇస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించాలి. హార్టికల్చర్ ఉత్పత్తులను ఎగుమతులు చేసేలా రైల్, రోడ్, ఎయిర్, వాటర్ కనెక్టివిటీ కూడా పెరగాలి."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**పరిశీలన తర్వాతే అనుమతులు: మంత్రి నారా లోకేష్**

ఎస్ఐపీబీ సమావేశం సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 'పెట్టుబడులు పెట్టే ప్రతి కంపెనీని పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే అనుమతివ్వాలని మంత్రి చెప్పారు. ఇదే సమయంలో పరిశ్రమ ఏర్పాటులో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని మంత్రి లోకేష్ సూచించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని... ప్రభుత్వ సమయం, కంపెనీల సమయం వృధా కాకుండా పెట్టుబడులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని లోకేష్ సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు టీజీ భరత్, పి.నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ హాజరయ్యారు. మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు వర్చువల్ గా హాజరయ్యారు. సీఎస్ విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఎస్ఐపీబీ ఆమోదించిన కంపెనీల వివరాలు:**

మొత్తంగా ఇప్పటి వరకు 13 సార్లు జరిగిన ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా రూ.8.29 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా 7,62,148 ఉద్యోగాలు రానున్నాయి. గురువారం జరిగిన 13వ ఎస్ఐపీబీ సమావేశంలో ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాలను అందుకోనున్న ఆరు కంపెనీలతో సహా మొత్తంగా 31 కంపెనీలకు ఆమోదం లభించింది. ఆమోదం పొందిన కంపెనీలు... పెట్టుబడులు... ఉద్యోగాల వివరాలివే...:

చింతా ఎనర్జీ-రూ. 8500 కోట్లు-5800 ఉ ద్యోగాలు
గనేకో త్రీ ఎనర్జీ-రూ. 2140 కోట్లు-1000 ఉద్యోగాలు
శ్రేష్ట రెన్యూవబుల్స్-రూ. 70 కోట్లు-339 ఉద్యోగాలు
క్యూపై ఇండియా-రూ. 47 కోట్లు-9 ఉద్యోగాలు
క్యూబైటెక్ స్మార్ట్ సొల్యూషన్స్-రూ. 15 కోట్లు-30 ఉద్యోగాలు
క్యూక్లైర్ వాయన్స్ క్వాంటం ల్యాబ్స్-రూ. 14 కోట్లు-5-12 ఉద్యోగాలు
సైబ్రా నెక్స్-రూ. 10 కోట్లు-10-15 ఉద్యోగాలు
క్యూ బీట్స్-రూ. 37 కోట్లు-40 ఉద్యోగాలు
సెనటల్లా ఏఐ థెరా ప్యూటిక్స్-రూ. 6 కోట్లు-40 ఉద్యోగాలు
ఫార్టీటూ42 టెక్నాలజీ ఇన్నోవేషన్స్-రూ. 9 కోట్లు-5-8 ఉద్యోగాలు
సిప్సా టెక్ ఇండియా-రూ. 1140 కోట్లు-1251 ఉద్యోగాలు
శ్రీ తమ్మిన సాఫ్ట్వేర్ సొల్యూషన్స్-రూ. 62 కోట్లు -500 ఉద్యోగాలు
ఏపీఎన్ హెల్త్ కేర్ ఆర్పీఎం-రూ. 30 కోట్లు-600 ఉద్యోగాలు
నాక్రెల్ టెక్నాలజీస్-రూ. 50.67 కోట్లు-567 ఉద్యోగాలు
పీవీఆర్ హస్పటాలిటీస్-రూ. 225 కోట్లు-1230 ఉద్యోగాలు
మెగ్లాన్ లీజర్స్-రూ. 348 కోట్లు-1700 ఉద్యోగాలు
యాగంటి ఎస్టేట్స్-రూ. 61 కోట్లు-250 ఉద్యోగాలు
నాందీ హోటల్స్-రూ. 150 కోట్లు-222 ఉద్యోగాలు
రిలయెన్స్ కన్స్యూమర్ ప్రొడెక్ట్స్-రూ. 1622 కోట్లు-1200 ఉద్యోగాలు
రామయాపట్నం కార్గో రెసిప్షన్ టెర్మినల్-రూ. 1615 కోట్లు-1300 ఉద్యోగాలు
సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్-రూ. 45 కోట్లు-300 ఉద్యోగాలు
TGV SRAAC-రూ. 1216 కోట్లు-400 ఉద్యోగాలు
శ్రీ వెంకటేశ్వర బయోటెక్-రూ. 122 కోట్లు-184 ఉద్యోగాలు
ఎమర్జ్ గ్లాస్ ఇండస్ట్రీస్-రూ. 182 కోట్లు-415 ఉద్యోగాలు
జీయట్ ఎనర్జీస్-రూ. 305 కోట్లు-300 ఉద్యోగాలు
రామన్ సింగ్స్ గ్లోబల్ ఫుడ్ పార్క్-రూ. 141 కోట్లు-600 ఉద్యోగాలు
గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయల్స్-రూ. 320 కోట్లు-700 ఉద్యోగాలు
మల్లాది డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్-రూ. 343 కోట్లు-355 ఉద్యోగాలు
విరూపాక్ష ఆర్గానిక్స్-రూ. 1225 కోట్లు-1500 ఉద్యోగాలు
రాముకా గ్లోబల్ ఎకో వర్క్స్-రూ. 193 కోట్లు-426 ఉద్యోగాలు
మాస్ ఫ్యాబ్రిక్ పార్క్-రూ. 200 కోట్లు-35000 ఉద్యోగాలు

## స్క్రబ్ టైఫస్ చికిత్సకు సంబంధించిన మందులు సిద్ధం!

తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. విజయనగరం జిల్లాలో జరిగిన ఓ మరణం స్క్రబ్బస్ కారణంగా జరిగినట్లు అనుమానిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రిలో టెస్టింగ్ జరిగిందని, ఎలిశా పరీక్ష చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని బోధనాసుపత్రుల్లో ఈ పరీక్షలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో ఏడు వీఆర్డీఏ ల్యాబ్లు ఉన్నాయని తెలిపారు. ఇవికాకుండా. తిరుపతి స్విమ్స్, మంగళగిరి ఎయిమ్స్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. పరీక్షల సంఖ్యను పెంచేందుకు, రీయేంజట్లను ఆసుపత్రులకు పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**నల్లమచ్చ కనిపించి జ్వరం వస్తే అప్రమత్తం కావాలి!**

2023 నుంచి రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసుల నమోదు జరుగుతుందని వీరపాండియన్ తెలిపారు. 2023లో 579, 2024లో 803 కేసులు, ఈ ఏడాది నవంబరు 30వ తేదీ వరకు 736 స్క్రబ్ టైఫస్ కేసులు రికార్డయినట్లు వెల్లడించారు. "వర్షాకాలంలో ఈ కేసులు ఎక్కువగా వస్తున్నాయి. జ్వరం, తలనొప్పితోపాటు శరీరంపై కీటకం కుట్టిన చోట నల్ల మచ్చ ఏర్పడుతుంది. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ కలిగిన చిగ్గర్ మైటు అనే కీటకం మనుషులను కుడుతుంది. ముఖ్యంగా ఎలుకలు సంచరించే ప్రదేశాల్లో ప్రభావితమయ్యే కీటకాలు మనుషులను కుట్టడంవల్ల స్క్రబ్ టైఫస్ జ్వరం వస్తుంది. కావిడ్లో మాదిరిగానే దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి దట్టమైన చెట్లు, వ్యవసాయ భూముల పక్కనే నివసించే వారిపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అధికంగా రాత్రి సమయాల్లో ఈ పురుగులను మనుషులను కుడుతుంటాయి పొలం పనులకు వెళ్లే వారు రబ్బరుతో తయారుచేసే షఉలు ధరిస్తే మంచిది. నివాస పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి' అని వీరపాండియన్ వివరించారు.

## రెండో రోజు ఉద్భవ్-2025లో మెరిసిన గిరిజన చిన్నారులు

ఫలితాలలో త్రిపుర, సిక్కిం, ఏపీ,ఒడిశా రాష్ట్రాల హవా సాగింది. రెండో రోజు నిర్వహించిన క్విజ్, మిమిక్రీ, శ్లోకాలు, నృత్య, సంగీత పోటీలలో విద్యార్థులు మెరిశారు. రెండో రోజు మొత్తం 22 విభాగాలలో ఈఎంఆర్ఎస్ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఉదయం 10 గం.ల నుంచి సాయంత్రం 4.30 గం.ల వరకు పోటీలు నిర్వహించారు. ఇప్పటికే పలు విభాగాలకు సంబంధించి పోటీల ఫలితాలు వెల్లడించారు. రేపటితో అన్ని విభాగాలకు తుది ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంది. ప్రధాన వేదిక కృష్ణ జింక వద్ద జరుగుతున్న డ్రామా పోటీలను వీక్షకులు ఆసక్తిగా తిలకించారు. జాస్మిన్ హాల్ వద్ద జరుగుతున్న శాస్త్రీయ సంగీత, నృత్య పోటీల వద్ద పండగ వాతావరణం నెలకొంది.



**11 పతకాలతో ఐదవస్థానంలో ఆంధ్రప్రదేశ్**

ఉద్భవ్-2025 ఉత్సవాలలో తొలి రెండు రోజులు కలిపి మొత్తం 46 ఈవెంట్లలో ఇప్పటివరకు 29 ఈవెంట్లు పూర్తయ్యాయి. అత్యధికంగా 22 పతకాలు సాధించి ఒడిషా రాష్ట్రం తొలి స్థానంలో సాధించింది. తెలంగాణ రాష్ట్రం 20 పతకాలు సాధించి రెండో స్థానంలో నిలిచింది. 16 పతకాలతో సిక్కిం 16, 13 పతకాలతో ఉత్తరాఖండ్ రాష్ట్రాలు మూడు, నాలుగు స్థానాలు దక్కించుకున్నాయి. 11 పతకాలతో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్ తర్వాతి స్థానాలలో నిలిచాయి. అయితే , శాస్త్రీయ సంగీతం, ఆశుకవిత్వం విభాగాలలో ఆతిధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పసిడి పతకం దక్కింది. దేశభక్తి గ్రూప్ సాంగ్ విభాగంలో రెండో స్థానంలో నిలిచింది. ఆశుకవిత్వం ఇంగ్లీష్ సీనియర్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ కు మూడో స్థానం దక్కింది.

**శుక్రవారం ఉద్భవ్-2025 ముగింపు**

ప్రాంతీయ జానపద బృంద నృత్యం, దేశభక్తి బృందగానం, గిరిజన సంప్రదాయ నృత్యం, కథ చెప్పడం, సృజన రచన, చిత్రలేఖనం వంటి పోటీలలో చిన్నారులు ఆసక్తిగా పాల్గొన్నారు. డ్రాయింగ్, పెయింటింగ్, కార్టూన్, విజువల్ ఆర్ట్స్, స్థానిక హస్తకళల విభాగం ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి. చివరిరోజున తొమ్మిది విభాగాలకు పోటీలు జరగనున్నాయి. రీజనల్ ట్రైబల్ డాన్స్, కర్ణాటక సంగీత గానం, వాయిద్యం, జానపద సంగీతం, నాటిక, ఆర్కెస్ట్రా వంటి విభాగాలకు ఆఖరి రోజున పోటీలు జరగనున్నాయి. అనంతరం అన్ని విభాగాలకు సంబంధించిన తుది ఫలితాలను వెల్లడించే అవకాశం ఉంది.

### పార్లమెంటులో హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లుపై వాడివేడీగా చర్చ

వ్యతిరేకించారు. ప్రభుత్వం ధూమపానం చేసేవారిపై పన్ను విధిస్తుంటే.. ఢిల్లీ గాలి మాత్రం మరింత విషపూరితంగా ఉందని సిపిఐ(ఎం) ఎంపీ శివదాసన్ ఎద్దేవా చేశారు. దీనిపై ఎన్‌సిపి ఎంపి సుప్రియా సూలే స్పందించారు. ఈ బిల్లుని తేవడం మంచిదే కానీ.. సెస్ రూపంలో పన్నులు ఎందుకు వసూలు చేస్తున్నారు అని ఆమె ప్రశ్నించారు. దీని ద్వారా పన్నుల ద్వారా ఆదాయం పెరుగుతుంది. కానీ ఈ ఆదాయం రాష్ట్రాలకు అందదు అని కేంద్రంపై ఆమె ఆరోపించారు.
ఈ బిల్లు చర్చ సందర్భంగా బీడి మాత్రం 40 శాతం స్లాబ్‌లోకి వెళ్లలేదు. 28 శాతం స్లాబ్ లేనందున బీడి 18 శాతం శ్లాబ్ కిందకి వచ్చింది అని నిర్మలా సీతారామన్ అన్నారు.

## శరవేగంగా రాజధాని అమరావతి నిర్మాణ పనులు

రూ. 163 కోట్లు అనుమతి లభించిందని, ఎస్టిమేషన్లు వేసి త్వరలో టెండర్లు పిలవనున్నామని వివరించారు. 2024-2025 వార్షిక నివేదిక సమర్పణకు కూడా అనుమతి లభించిందన్నారు. ఇక అమరావతి నగర నిర్మాణానికి నాబార్డ్ ద్వారా రూ. 7380.70 కోట్లు రుణం పొందడానికి అనుమతి పొందటం జరిగిందన్నారు. రూ. 532 కోట్లతో సీడ్ యాక్సిస్ రోడ్ ను నేషనల్ హైవే 16కి కలపడానికి టెండర్ ప్యాకేజికి అప్రూవల్ ఫర్ అవార్డ్ ను అథారిటీ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అమరావతి ప్రాంతంలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, ఇన్నర్ రింగ్ రోడ్, రైల్వే ట్రాక్ తదితరాల నిర్మాణాలకు ల్యాండ్ పూలింగ్ ద్వారా 16,666 ఎకరాలు సేకరించనున్నామన్నారు. అమరావతి రాజధాని ప్రాంత రైతులతో ముఖాముఖి మాట్లాడటం జరిగిందని, రైతులందరూ తమ భూములను ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేయడం అభినందనీయమన్నారు. రైతులతో మరిన్ని సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతామన్నారు. గతంలో రైతులకు అందించిన ప్యాకేజీ వలే, ఇప్పుడు కూడా రైతులకు 10 సంవత్సరాలు ప్యాకేజీ అందిస్తామని హామి ఇచ్చారు. సీడ్ యాక్సిస్ రోడ్ మొదట మంగళగిరి రోడ్ కు జనవరి నెలాఖరు లోపు అనుసంధానం చేయనున్నామని, అటుపై నేషనల్ హైవే 16కు అనుసంధానం చేయనున్నామని వివరించారు. అనంతరం కరకట్ట రోడ్ ను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సీడ్ యాక్సిస్ రోడ్ నిర్మాణంలో అవసరమైన చోట స్టీల్ బ్రిడ్జిల నిర్మాణం, ఫ్లైఓవర్ లు నిర్మాణాలు చేపట్టనున్నామని వివరించారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ఇప్పటికే 15 అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలు నిర్మాణం పూర్తి అయ్యాయని, ఈ డిసెంబర్ నెలాఖరులోపు ప్రారంభానికి సిద్ధం అవుతాయని మంత్రి నారాయణ వివరించారు. ఇక మార్చి నెలాఖరు లోపు అధికారుల భవన సముదాలు పూర్తి చేయాలని లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో 1500 కిలోమీటర్ల ఎల్పీఎస్ రోడ్లు ఇప్పటికే అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

## కూటమి నాయకుల ఐక్యతే రాష్ట్రాభివృద్ధికి మూలం

పేర్కొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో సమూల మార్పులు తీసుకురావాలనే రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసులు ప్రారంభించామని, ఏళ్ల తరబడి ప్రమోషన్లకు నోచుకోని 10 వేల మంది పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించగలిగామని అన్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి కొడుకుగా పదోన్నతి ఎంత కీలకమో తెలుసు కాబట్టే... ఎటువంటి పైరవీలకు తావు లేకుండా అర్హతే ఆధారంగా ఉద్యోగులకు పదోన్నతలు కల్పించామన్నారు. గురువారం చిత్తూరు రెడ్డిగుంట వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసును ప్రారంభించిన అనంతరం జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "ఈ రోజు కూటమి ప్రభుత్వం వ్యవస్థల ప్రక్షాళనపై ఇంత బలంగా ముందుకు వెళ్తుందంటే దానికి కారణం మీ అందరి మద్దతు. మీరు ప్రభుత్వానికి అండగా నిలబడడంతోనే ఇదంతా సాధ్యమైంది.

**మన ఐక్యతే రాష్ట్రానికి బలం**

కూటమిలో ఉన్న మూడు పార్టీల నాయకులకు విభిన్న భావజాలాలు ఉన్నా... మనందరం "రాష్ట్రం బాగుండాలి- అరాచకాలు ఉండకూడదు " అనే సదుద్దేశంతో ఒక గొడుగు కిందకు వచ్చి కూటమిగా ఏర్పడ్డాం. మనలో మనకు చిన్న చిన్న కమ్యూనికేషన్ గ్యాప్స్, మనస్పర్థలు ఉండటం సహజం. ఒక చోట కూర్చొని మాట్లాడుకుంటే అన్ని సమస్యలు తీరతాయి. ఆ రోజు చిన్నగా మొదలుపెట్టిన కూటమి ఈ రోజు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి ఎంతో బలమైన శక్తిగా మారింది. ఈ రోజు ఇంతమందికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వగలిగామంటే కారణం మనందరి ఐక్యతే. ఇదే ఐక్యతతో మరో 15 ఏళ్లు కష్టపడితే రాష్ట్రానికి సుస్థిర అభివృద్ధి సాధ్యం అవుతుంది.

**కష్టపడితేనే... ప్రతిఫలం**

నేను 2008 నుంచి రాజకీయాల్లో ఉన్నాను. ఏనాడు కూడా గుర్తింపు కోరుకోలేదు. సమాజంలో నిస్సహాయులైన వ్యక్తులకు అండగా నిలబడడమే నాయకుడి లక్షణం. నిస్వార్థంగా మన పని మనం చేసుకుపోతే గుర్తింపు, పదవి వాటికవే వస్తాయి. అంతే తప్ప పదవే పరామావధిగా భావించి పని చేస్తే అందలం ఎక్కడం కష్టం. ఏ వ్యక్తికి అయినా పదవి అనేది బాధ్యత తప్ప అలంకారంగా మారకూడదు. మన జిల్లాకే తలమానికం అయిన శేషాచలం అడవులను అడ్డగోలుగా దోచేశారు. ఇప్పటి వరకు దొరికిన సంపద కేవలం 10 శాతం మాత్రమే... దొరికిన పది శాతం విలువే వేలకోట్లలో ఉంటే... ఇప్పటి వరకు దొరకని సంపద విలువ ఎన్ని వేల కోట్లు ఉంటుందో మనం అర్థం చేసుకోవచ్చు. అలాంటి వాళ్లను మనం నిలువరించాలి. అవినీతిని అరికట్టి బలహీనుల గొంతుగా మారాలి. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన శ్రీ చంద్రబాబు గారినే రాష్ట్రంలో ఒక నియోజకవర్గంలో అడుగుపెట్టనివ్వం అని గత పాలకులు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ ఎన్నికలను ఏకగ్రీవం చేయడానికి భయపెట్టాలని చూడటం మనం చూశాం. అయినా జనసేన ఎక్కడా తగ్గలేదు. పంచాయతీ ఎన్నికల్లో ప్రాణాలకు తెగించి నిలబడ్డారు. జనసేన పార్టీ ముఖ్య లక్ష్యం సమాజంలో కోల్పోయిన ధైర్యాన్ని నింపడం. ఆ దిశగా పార్టీ అడుగులు వేస్తుంది. కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకొని మరి గుర్తింపు ఇస్తాం. గ్రామ స్థాయి నుంచి లోక్ సభ నియోజక వర్గం వరకు ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు శ్రీ గురజాల జగన్మోహన్, శ్రీ అరణి శ్రీనివాసులు, శ్రీ కె. మురళీమోహన్, శ్రీ అరవ శ్రీధర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ శ్రీ కొట్టే సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**స్వచ్ఛరథాలు పరిశీలన**

స్వచ్ఛాంధ్ర స్ఫూర్తిని పల్లె ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి పంచాయతీరాజ్ శాఖ ఇటీవల ప్రయోగాత్మకంగా చేపట్టిన స్వచ్ఛరథాలను శ్రీ పవన్ కళ్యాణ్ గారు పరిశీలించారు. తిరుచానూరు, కరకంబాడి పంచాయతీల నుంచి తీసుకొచ్చిన స్వచ్ఛ రథాల దగ్గరకు వెళ్లి ప్రజలకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. పొడి చెత్త, పనికిరాని వస్తువులు తీసుకొస్తే ప్రజలకు అందిస్తున్న నిత్యావసరాలను పరిశీలించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని అధికారులను అభినందించారు.

## చంద్రబాబుకు దేవుడంటే భయం, భక్తి లేవు: జగన్

భక్తి, భయం లేని చంద్రబాబు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, "కల్తీ నెయ్యి ఆరోపణలు ఉన్న ఆ ట్యాంకర్లు ప్రసాదం తయారుచేసే పోటులోకి వెళ్లాయా? అందుకు మీ దగ్గర ఆధారాలు ఉన్నాయా?" అని సూటిగా ప్రశ్నించారు. టీటీడీలోకి వచ్చే ప్రతి నెయ్యి ట్యాంకర్‌ను కఠినమైన తనిఖీలకు గురిచేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఎన్ఏబీఎల్ సర్టిఫికేషన్ ఉన్నప్పటికీ, టీటీడీ సొంత ల్యాబ్‌లో కూడా పరీక్షలు పాస్ అయితేనే ఆ నెయ్యిని వినియోగానికి స్వీకరిస్తారని వివరించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని ట్యాంకర్లను వెనక్కి పంపడం ఒక సాధారణ ప్రక్రియ అని జగన్ తెలిపారు. గతంలో చంద్రబాబు హయాంలో 17 సార్లు, తమ ప్రభుత్వ హయాంలో 18 సార్లు ట్యాంకర్లను తిప్పి పంపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇంతటి పటిష్టమైన భద్రతా, నాణ్యతా ప్రమాణాలు అమల్లో ఉండగా కల్తీ జరిగిందని ఎలా అంటారని నిలదీశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే పవిత్రమైన ప్రసాదంపై ఆరోపణలు చేస్తున్నారని జగన్ అన్నారు.

## తెలుగుదేశంలో వ్యక్తులు శాశ్వతం కాదు... పార్టీ శాశ్వతం!

మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు నాయుడు గారు, నేను ఎక్కడికి వెళ్లినా కార్యకర్తలను కలిశాకే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్ణయించుకున్నాం. అధికారంలోకి రావడానికి దశాబ్దాలుగా ఎత్తిన పసుపుజెండా దించకుండా కష్టపడిన ప్రతి కార్యకర్త శ్రమ దాగిఉంది. 2019-24 నడుమ సైకో పాలన చూశాం, బయటకు రావాలంటే గేట్లకు తాళు కట్టారు, నాపై ఎస్సీ,ఎస్టీ కేసులు, హత్యాయత్నం కేసులు పెట్టారు. యువగళం పాదయాత్ర చేస్తుంటే జిఓ 1 తెచ్చారు. అయినా నేను తగ్గలేదు.

**కరుడుగట్టిన కార్యకర్తలే నాకు స్ఫూర్తి**

ప్రతిపక్షంలో ఉండగా అంజిరెడ్డితాత నామినేషన్ పత్రాలు లాక్కునేందుకు ప్రయత్నిస్తే తొడగొట్టి మరీ నామినేషన్ వేశారు. పల్నాడులో మంజుల గారి పై ప్రత్యర్థులు దాడి చేసినా పోలింగ్ బూత్ వద్ద వైసిపి రిగ్గింగ్ అడ్డుకున్నారు. అటువంటి కరుడుగట్టిన కార్యకర్తలే నాకు స్ఫూర్తి. పల్నాడులో తోట చంద్రయ్య అనే కార్యకర్తను మెడపై కత్తిపెట్టి వారి నాయకుడికి జై కొట్టమంటే జైటిడిపి, జై చంద్రబాబు అని ప్రాణాలు వదిలారు. చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా 94శాతం సీట్ల సాధించడం వెనుక మీ అందరి కష్టం, చెమట దాగి ఉన్నాయి. వేదికపై ఉన్న నాయకులందరం అదృష్టవంతులం. అయిదేళ్లు మీరు మా వెంట నిలిచారు. నాయకులు వెళ్లిపోయినా కార్యకర్తలే అండగా నిలిచారు. చంద్రబాబు గారిని 53రోజుల్లో జైల్లో పెడితే అండగా నిలబడి బయటకొచ్చి పోరాడింది కార్యకర్తలే, అందుకే పార్టీ మీకు రుణపడి ఉంటుంది. ఇంత అద్భుతమైన కార్యకర్తలు టిడిపికి మాత్రమే సొంతం. ఒక్క పిలుపు ఇస్తే సైన్యంలా తరలివచ్చే కేడర్ మనకే సొంతం.

**ఇప్పుడు ఉత్తరాంధ్ర ఎపికి బ్యాక్ బోన్**

ఎన్నికల సమయంలో చంద్రబాబుగారు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చారు. మొదటి హామీ నిరుద్యోగ యువతకు 20లక్షల ఉద్యోగాలు. అధికారంలోకి వచ్చి 18నెలలే అయింది. ఇప్పుడు ఉత్తరాంధ్ర బ్యాక్ వర్డ్ ప్రాంతం కాదు, ఎపికి బ్యాక్ బోన్. 18నెలల్లోనే భోగాపురం ఎయిర్ పోర్టు, గూగుల్, ఆర్సెలర్ మిట్టల్.. వంటి ఎన్నో భారీ ప్రాజెక్టులు తెచ్చాం. ఎన్ని ఇబ్బందులున్నా మాట నిలుపుకుంటున్నాం. దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్లు, మహిళలకు ఉచిత బస్సు కల్పించిన ఘనత కూటమిదే. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇచ్చి మాట నిలుపుకున్నాం. అన్నదాత సుఖీభవ కింద నిధులు విడుదల చేశాం.

**ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి**

గతంలో ఉద్యోగులకు జీతాలు కూడా సరిగా ఇచ్చేవారు కాదు. ఇప్పుడు దేశంలో ఎక్కడా లేనివిధంగా 4వేల పెన్షన్ ఇస్తున్నాం. ఇంత పెద్దమొత్తంలో పెన్షన్ ధనిక రాష్ట్రాలు కూడా ఇవ్వడం లేదు. వికలాంగులకు 6వేలు, బెడ్ కు పరిమితమైన వారికి 15వేలు ఇస్తున్నాం. అధికారంలో వచ్చిన తొలి ఏడాదే మెగా డిఎస్సి ప్రకటిస్తానని చెప్పి 150రోజుల్లో పూర్తిచేశాం. వైసిపి నాయకులు 150 కేసులు వేసినా అనుకున్నది చేసి చూపించాం. ప్రజాదర్బార్ ద్వారా కార్యకర్తలు, ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నాం. 2004 తర్వాత గిరిజన ప్రాంతాల్లో ఇంత పెద్దఎత్తున ఎప్పుడూ గెలవలేదు. మనపై బాధ్యత పెరిగింది. ఆశతో ప్రజలు మనవైపు చూస్తున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. గిరిజన ప్రాంతాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టాం.

**ప్రజలు శాంతియుత పాలన కోరుతున్నారు**

గతం ప్రభుత్వంలో మాదిరి అరాచకాలు కూటమిపాలనలో ఉండకూడదన్నది ప్రజల ఆకాంక్ష. ప్రజలు శాంతియుత పాలన కోరుకుంటున్నారు. సైకోపాలనలో మన కార్యకర్తలను వెంటాడారు, కేసులు పెట్టారు. ప్రజలను కూడా వదల్లేదు. దళిత డాక్టర్ సుధాకర్ ను పిచ్చోడని ముద్ర వేసి చంపారు, రేపల్లెలో అమర్నాథ్ గౌడ్ అనే తమ్ముడ్ని చితకబాది కాగితాలు నోట్లో కుక్కి పెట్రోల్ పోసి చంపారు. ట్రైబల్ సోదరుల కోసం అనేక కార్యక్రమాలు ప్రారంభించాం. అయితే చేయాల్సింది చాలా ఉంది. పట్టుదల, సంకల్పంతో ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకునేందుకు కృషిచేస్తున్నాం.

**చేసిన మంచిని ప్రజలకు చెప్పాలి**

చంద్రబాబు గారు 75ఏళ్ల వయసులోనూ 25ఏళ్ల యువకుడిలా పరుగెడుతున్నారు. ప్రజాసేవలో ఆయన కమిట్ మెంట్ వేరు. పార్టీపట్ల, కార్యకర్తకర్తలపై ఆయనకున్న ప్రేమను అందరూ గమనించాలి. తరతరాలుగా కొన్ని సమస్యలు మనల్ని వెంటాడుతున్నాయి. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు పేరుతో ఆనాడు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని సాధించుకున్నాం. వివిధ కారణాల వల్ల మూతపడే పరిస్థితి వస్తే కేంద్రం, రాష్ట్రం కలిసి 14వేల కోట్లు ఇచ్చి కాపాడుకున్నాం. విశాఖ రైల్వేజోన్ అయిదేళ్లలో సాధించలేనిది మొదటి సంవత్సరమే సాధించాం. ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు 18నెలల్లో చేశాం. చేసిన పనులు చెప్పుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది.

**అలిగి ఇంట్లో పడుకోవద్దు**

అలిగి ఇంట్లో పడుకుంటే నష్టపోయేది మనమే. పార్టీలో సంస్కరణల కోసం జగన్ తో కంటే మూడు,నాలుగురెట్లు పోరాడాను. బాబు గారిని ఒప్పించడం అంత తేలిక కాదు. అనుకున్నది సాధించేవరకు నేను వదలిపెట్టను. ఇది మన పార్టీ, మనం మాట్లాడుకొని చర్చించి సాధించుకోవాలి. గ్రామ, మండల, నియోజకవర్గం, పార్లమెంటు, జోనల్ స్థాయిలో సమస్యలు పరిష్కరించుకోవాలి. మనపార్టీని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది. కలసికట్టుగా అందరం ముందుకెళ్లాలి. ఆంధ్రప్రదేశ్ లో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు వల్లే రాష్ట్రానికి కావాల్సినవి సాధించుకుంటున్నాం. పవనన్న చెప్పినట్లుగా రాబోయే 15ఏళ్లు మనం కలసి ఉండాలి. చిన్నచిన్న సమస్యలుంటే కూర్చుని మాట్లాడుకొని పరిష్కరించుకోవాలి.

**రూ.50కోట్లు చిన్నదొంగతనమా?**

ఈరోజు జగన్ విలేకరులతో మాట్లాడుతూ... పరకామణిలో ఒకడు 50కోట్లు డబ్బు దొంగిలిస్తే, అది చిన్నది అంటున్నాడు. అది చిన్న దొంగతనమా? జగన్ కు చెబుతున్నా... దేవుడే మిమ్మల్ని చూసుకుంటాడు . ఆయన దేవుడ్ని పట్టించుకోడు, ప్రజలను పట్టించుకోడు. గుంటూరు జిల్లాలో పరామర్శకు వెళ్లి మరో ఇద్దరినీ చంపారు. కారు మెడపై నుంచి వెళ్లినా ఆగలేదు. వైసిపిలో కార్యకర్తలంటే గౌరవం ఉండదు. తల్లి, చెల్లి మెడబట్టి బయటకు నెట్టిన సైకో పార్టీ మనది కాదు. అందరినీ గౌరవించే పార్టీ మనది. ఈ మధ్య రప్పారప్పా అంటున్నారు. అందుకే మనం కుర్చీ మడతపెట్టాం. అధికారంలో ఉన్నపుడే ఏం చేయలేకపోయారు, ఇప్పుడు భయపడతామా?

**కార్యకర్తలను గౌరవించి తీరాల్సిందే**

టిడిపి కార్యకర్తలు ఆఫీసులకు వెళితే గౌరవంగా చూడాల్సిందే. ప్రతి పనికి లోకేష్, ఎమ్మెల్యే ఫోన్ చేయాలంటే కుదరదు. చట్టప్రకారం చేయాల్సిన పనులు చేయాల్సిన బాధ్యత వారిపై ఉంది. ఈ విషయంలో ఇన్ చార్జి మంత్రి అచ్చెన్న కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాలివ్వాలి. గ్రూపు రాజకీయాలు ఉండకూడదు, అటువంటి వాటికి ఫుల్ స్టాప్ పెట్టండి. అందరం కలసి పార్టీని నిలబెట్టుకోవాలి. ఎవరు చేయాల్సిన పనులు వారు చేయాలి. మనందరి నాయకుడు చంద్రబాబు గారు ఒక్కరే. చంద్రబాబు మన సేనాధిపతి, అందరం సైనికులం. ఆయన ఆదేశిస్తే ఎంతదూరమైనా పరిగెడతాం. అబ్జర్వర్, జోనల్ కోఆర్డినేటర్ అందుబాటులో ఉంటారు. పనిచేసిన నాయకులను ఎలా ప్రోత్సహించాలో పార్టీకి వదిలేయండి. కలసికట్టుగా పనిచేద్దాం, ముందుకెళదాం. మై టిడిపి యాప్ ద్వారా కేడర్ కు బాధ్యతలు ఇస్తాం, మీరు సమర్థవంతంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలి. పార్టీ కేడర్ ను గుర్తించేందుకు టెక్నాలజీతో అనుసంధానిస్తున్నాం. మనది నాయకులపై నడిచే పార్టీ కాదు, కార్యకర్తలపైన, వ్యవస్థపైన నడిచే పార్టీ. ఇందులో అందరూ అనుసంధానం కావాలి. పార్టీ కార్యకర్తలను నాయకులు గౌరవించాలి. తప్పులుంటే సరిదిద్దుకోవాల్సిన బాధ్యత మాది. మన సమస్యలు మనమే పరిష్కరించుకోవాలి. కలసికట్టుగా పనిచేద్దాం, చిత్తశుద్ధి, పట్టుదలతో ముందుకు సాగుదామని యువనేత లోకేష్ పేర్కొన్నారు.

**పార్టీ బాగుంటేనే కార్యకర్తలు బాగుంటారు!**

జోనల్ ఇన్ ఛార్జి దామచర్ల సత్య మాట్లాడుతూ... కార్యకర్తల కష్టాన్ని గుర్తించే పార్టీ తెలుగుదేశం. పార్టీ బాగుంటే కార్యకర్తలు బాగుంటారు, కార్యకర్తలు బాగుంటే పార్టీ బాగుంటుంది, కోటిమంది సభ్యులు చేర్చిన సత్తాగల నాయకుడు లోకేష్ అని అన్నారు. పార్లమెంటు అధ్యక్షుడు కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం 3,132 కి.మీ. పాదయాత్ర చేసిన యోధుడు నారా లోకేష్. కార్యకర్తల కష్టసుఖాలు తెలుసుకొని అండగా నిలుస్తున్నారు. కార్యకర్తలకు నేనున్నానని భరోసా ఇస్తున్నారని అన్నారు. పాలకొండ ఇన్ ఛార్జి పడాల భూదేవి మాట్లాడుతూ... కార్యకర్తల మనసులో మాట వినడానికే లోకేష్ వచ్చారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. 2029లో కూటమి ప్రభుత్వం మళ్లీ రావడానికి కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జిల్లా ఇన్ ఛార్జి మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, ఉత్తరాంధ్ర టిడిపి సమన్వయకర్త దామచర్ల సత్య, అరకు పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు కిడారి శ్రావణ్ కుమార్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ ఇన్ ఛార్జి పడాల భూదేవి పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్...

మరణించారు. ఈ భీకర కాల్పుల్లో ముగ్గురు భద్రతా సిబ్బంది కూడా వీరమరణం పొందారు. ఈ ఏడాది బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు ఇదే అతిపెద్ద నష్టమని అధికారులు భావిస్తున్నారు. గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశ్‌కుతుల్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), సీఆర్పీఎఫ్ కోబ్రా కమాండోలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా దళాలు దీటుగా స్పందించాయి. చాలా గంటల పాటు సాగిన ఈ పోరులో తొలుత 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు ప్రకటించారు. గురువారం ఉదయం ఘటనా స్థలంలో జరిపిన గాలింపు చర్యల్లో మరో ఆరు మృతదేహాలు లభించడంతో మృతుల సంఖ్య 18కి చేరింది. ఈ పోరాటంలో డీఆర్‌జీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ మోను మోహన్ బడ్డి, కానిస్టేబుల్ దుకారు గోండే, జవాన్ రమేశ్ సోడీ కూడా మరణించారు. వారి మృతదేహాలను బీజాపూర్ హెడ్ క్వార్టర్స్‌కు తరలించి, ఉన్నతాధికారులు, తోటి జవాన్లు ఘనంగా నివాళులర్పించారు. ఘటనా స్థలం నుంచి భారీ ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర సింగ్ మీనా తెలిపారు. మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, సమీప అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు.

# సంపాదకీయం

# చలి కాలపు జంఝూటం

దక్షిణాది రాష్ట్రాలను 'చలి పులి' పిండేస్తోంది. జనం ఝాము పొద్దెక్కినా నిద్రలేవలేకపోతు న్నారు. చలికి భయపడి మంచాలు దిగిరావడం లేదు. శీతాకాలంలో చలి ఎక్కువగానే ఉంటుందని ముందుగానే భారత వాతావరణ విభాగం హెచ్చరించిం ది. తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్, ఒడిశాలోని అధిక ప్రాంతాలకే ఈ పరిస్థితి ఉంది. తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు పక్కనే ఉన్న పార్వతీపురం, మన్యం, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చలి తీవ్ర ప్రభావాన్ని చూపెడుతోంది. ఆంధ్ర ప్రదేశ్లో గత యేడాది ఇదే సమయంలో చలి ప్రభావాన్ని గమనిస్తే ఈసారి తక్కువేనని చెప్పాలి. చలి ఎక్కు వగా ఉన్నా, తక్కువగా ఉన్నా ఆయా రాష్ట్రాలలో అధిక చలి వలన సీజనల్ జ్వరాలకు జనంలో ఆందోళన పెరిగి పోయింది. ఆస్పత్రుల్లో రద్దీ పెరిగింది. ప్రైవేట్ ఆస్పత్రు లు కిటకిటలాడుతున్నాయి. చలితోపాటు సాంక్రమిక వ్యాధులు ప్రజల్ని ఊపిరిపీల్చుకోనివ్వడం లేదు. ఇంత చలిలోనూ కళ్లు మంటలు తప్పడం లేదు. ఈ నేపథ్యం లోనే ప్రతి వ్యక్తి నీరు ఎక్కువగా తాగాలని జాగ్రత్తలు చెప్తున్నారు డాక్టర్లు. చలికాలపు శీతల వాతావరణాన్ని గతంలో మాదిరిగా తట్టుకోలేకపోతున్నారు. ఉష్ణోగ్రతలు భారీగా తగ్గిపోవడమే అందుకు కారణం. ప్రత్యేకించి చల్లటి వాతావరణం, పొగమంచుతోపాటు తేమ కూడా కాస్త ఇబ్బందిపెడుతోంది. అధిక చల్లదనాన్ని భరించలేని శరీరానికి రోగ నిరోధక శక్తి కూడా తగ్గిపోతుంది. ఈ సీజన్లో వ్యాప్తి చెందే సాధారణ వ్యాధులతోపాటు కొన్ని వైరస్లకు సంబంధించిన కొత్త వేరియంట్స్ తో కలిపిన జ్వరాలు రోగుల మీద దాడిచేస్తున్నాయి. ఈ మధ్య కాలం లో జలుబు, గొంతునొప్పి విపరీతంగా జనాన్ని బాధిస్తున్నాయి. స్త్రీ, బాల, వృద్ధులు వీటికి గురై ఆస్ప త్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సీజన్లో శ్వాసకోస సంబంధిత వ్యాధులు బాగా ఉధృతంగా ఉన్నాయి. ఈ కాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉండడంతోనే జలుబు, గొంతునొప్పులు వగైరా లక్షణాలు కనిపిస్తున్నాయి. ఓ పట్టాన శీతాకాలపు వ్యాధులు అంత గమ్మున తగ్గవు. సతాయిస్తూనే ఉంటాయి. వాటి లక్షణాలు విచిత్రంగా ఉంటాయి. పుండ్లు కూడా మానవు. ఒక్కొక్కప్పుడు శీతగాలులకు కళ్లు మసకబారుతాయి. ఫ్లూ, న్యూమోని యా, బ్రాంకైటిస్ వంటి సీజనల్గా వచ్చే వ్యాధులు శ్వాసకోస అలెర్జీలను వెంటతెస్తాయి. తలనొప్పి, తుమ్ము లు, కండరాల నొప్పిలతో జ్వరాలు సోకుతున్నాయి. వీటితోపాటు న్యూమోనియా సోకితే కోలుకోవడానికి కొదినద రోజులు పడుతుంది. శ్వాసకోశ వ్యాధులన్నీ ఇబ్బంది పెట్టేవే. శ్వాసకోశంలో ఇన్ఫెక్షన్ పెరిగితే కండరాల నొప్పులు, ఉబ్బసం లక్షణాలతో నీరసపడతాయి. కొందరి లో ఆస్మాతీవ్రత పెరిగి ముక్కుదిబ్బడేస్తుంది. గొంతులో శ్లేష్మం ఊరుతుంది. తరచు ఇబ్బంది పెడుతుంది. ఉష్ణో గ్రతలు బాగా తగ్గడం వలన రక్తనాళాల్లో ఒత్తిడి పెరిగి ఒక్కోసారి హార్ఎటాక్ కి గురవుతారు. వయసుతో నిమిత్తం లేకుండా చలి నుంచి రక్షణ పొందేందుకు అప్రమత్తమవ్వా లి. చర్మంలో తేమ తగ్గిన సందర్భాలలో చర్మం పొడిగా మారి ఎగ్జిమా, డయాబిటిస్ వ్యాధులకు దారితీస్తాయి. చర్మానికి పోషకాలు అందని పరిస్థితులు ఏర్పడతాయి. చర్మవ్యాధులు సోకితే వంటిపై దద్దుర్లు ఏర్పడడం, మంటలెక్కిపోతుం టాయి. ఆంధ్రప్రదేశ్లో నిర్దేశితకాలాల తో నిమిత్తం లేకుండా కురుస్తున్న వర్షాలు మరో విధంగా రోగాలను ఆహ్వానిస్తున్నాయి. గాలిలో తమ కారణంగా ఒళ్లు మంటలు బాధిస్తాయి. తగినంత నీటిని తీసుకోక పోతే డయేరియా, కలరా వంటి వ్యాధులు సోకుతాయి. శరీరానికి సరిపడనంత నీరు డీహైడ్రేషన్ ఏర్పడుతుంది. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితుల్నుంచిమనల్ని మనమే కాపాడుకోవాలి. సరైన పోషకాహారం తీసుకోవా లి. ఇదే సమయంలో కాలుష్య వ్యాప్తిని కూడా గుర్తించా లి. పొగమంచుతో బయటకు విడుదలయ్యే కాలుష్యగాలి, మంచు కలిపి కలరా వంటి

వ్యాధులు వ్యాప్తికి కారణమౌ తాయి. ఇదే సందర్భంలో శీతాకాలంలో వచ్చే దోమల బెడదను ఎదుర్కోవాల్సిన ఉంటుంది. మలబద్ధకం, పేగు సంబంధిత సమస్యలు, రక్తస్రావం సమస్యలుంటాయి. వర్షాల వల్ల గుంటల్లోకి నీరు చేరి కాలుష్య కారకాలవు తున్నాయి. ఇక్కడ నిల్వ ఉండే పరిస్థితుల్లో దోమలు విజృంభిస్తాయి. దోమల బాధను తట్టుకోలేక జనం దోమ తెరలను, కాయిల్స్ ను ఆశ్రయిస్తున్నారు. మలేరియా, పైలేరియా వ్యాధులు సోకకుండా డాక్టర్ల సలహాలు తీసుకోవాలి. కొత్త తరహా వైరస్ వ్యాధి 'స్క్రబ్ టైఫస్' ఇప్పు డు ఆంధ్రప్రదేశ్లో ప్రవేశించి ముగ్గురిని కాటేసింది. విజ యనగరం, చిత్తూరు పల్నాడు జిల్లాల్లో ఈ వ్యాధి వ్యాప్తి ఉంది. 'చిగ్గర్మైట్' కీటకాలు కుట్టడం వల్ల వచ్చే వ్యాధి. దీనిపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. ఈ వ్యాధి గురించి రాష్ట్ర ప్రజలు కొత్తగా వింటున్నారు. అంటు వ్యాధి కాదని డాక్టర్లు చెప్తున్నా ఈ వ్యాధి లక్షణాలు, జాగ్ర త్తలు గురించి జనానికి విస్తృత పరిచయం చేయాల్సిన అవసరముంది. అధిక జ్వరం, చలి, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులతోపాటు వంటిపై గోకుడుపుండ్లు వంటి వి ఏర్పడతాయి. శీతాకాలపు పుండు బ్రహ్మరాక్షసిగా మారకుండా, చలిప్రాంతాలలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయడం అత్యంత అవశ్యకం. ఈ వ్యాధి అంటువ్యాధి కాదని శాస్త్రజ్ఞులే వివరించాల్సి ఉంది. మరింత వ్యాపించకముందే వైద్యసిబ్బందికి అవగాహన కల్పించడం ప్రభుత్వ బాధ్యత.

# 77 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసులు ప్రారంభం

### చిత్తూరు నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**చిత్తూరు, డిసెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్య స్థాపనకు తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసులను గురువారం నాడు ఆయన చిత్తూరు నుంచి వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సరదర్భంగా పవన్ మాట్లాడుతూ%ౌ%ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో రాష్ట్రానికి కేంద్రం నుంచి తగిన సహాయం అందుతోందని, అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని తమ ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే డిడి ఆఫీసులు ప్రారంభించామని, వీటిలో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి డిడిఒ, డిఎల్‌పిఒ, ఎపిడి, డ్వామా ఇతర అధికారులు సేవలందిస్తారని తెలిపారు. గ్రామస్థాయిలో 7,244 క్లస్టర్‌లను రద్దు చేసి 13,350 గ్రామ పంచాయతీలను స్వయం పాలన సంస్థలుగా తీర్చిదిద్దామన్నారు. పదివేలు జనాభా దాటిన



గ్రామపంచాయతీలకు ఒక గెజిటెడ్ ఆఫీసర్‌ను పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారిగా నియమించామని, ప్రస్తుతం ఉన్న ఐదు గ్రేడ్ల పంచాయతీ సెక్రటరీలను మూడు గ్రేడ్‌లుగా చేస్తూ పంచాయతీ సెక్రటరీ పేరును పంచాయతీ అభివృద్ధి అధికారిగా మార్చామని తెలిపారు. పంచాయతీరాజ్ సంస్థలను పటిష్టం చేయడానికి ఒక ప్రత్యేక ఐటి వింగ్‌ను ఏర్పాటు చేశామన్నారు.

**పంచాయతీరాజ్ శాఖలోనూ డివిజనల్ అధికారి..**

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ విఆర్ కృష్ణతేజ మాట్లాడుతూ%ౌ% మండల స్థాయిలో అభివృద్ధి శాఖకు ఎంపిడిఒలు, రెవెన్యూ శాఖకు తహశీల్దార్లు, పోలీసు శాఖకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లు ఉంటారని, వీరికి సంబంధించి రెవెన్యూ, పోలీసు శాఖకు మాత్రమే డివిజనల్ కార్యాలయాలు ఉన్నాయని, ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులతో ఇకపై పంచాయతీరాజ్ శాఖకు కూడా ఒక డివిజనల్ స్థాయి అధికారి ఉంటారని వివరించారు. గ్రూప్-1 ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తామని, యువతకు ఇది ఒక గొప్ప అవకాశమన్నారు.


ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా శ్రీకాకుళం నుంచి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, తెనాలి నుంచి పౌర సరఫరాశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, నెల్లూరు జిల్లా ఆత్మకూరు నుంచి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పెనుగొండ నుంచి బిసి సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ పాల్గొన్నారు. శ్రీకాకుళం, తెనాలి, పాడేరు డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు డిప్యూటీ సిఎంతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు, పూతలపట్టు, తిరుపతి, కోడూరు ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరులో స్క్రబ్ టైఫస్ కలకలం

- నెల రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి
- చికిత్స పొందుతున్న ఎనిమిది మంది బాధితులు
- ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు

**గుంటూరు, డిసెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నాయి. గత నెల రోజుల వ్యవధిలో ఇద్దరు మహిళలు మృతి చెందగా మరో ఎనిమిది మంది గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ కేసుల కోసంగుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ తెలిపారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని మోరబోయిన జ్యోతి (19) మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గత నెలలో మరణించారు. వరి పొలంలో పురుగు కుట్టడాన్ని పెద్దగా పట్టించుకోకపోవడంతో కొద్దిరోజులకు ఆమెకు తీవ్ర జ్వరం వచ్చింది. దీంతో ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న అనంతరం జ్వరం తగ్గిపోయింది. ఆ తర్వాత వాంతులు, విరేచనాలు మొదలవ్వడం, పురుగు కుట్టిన చోట దద్దుర్లు వచ్చి పుండు ఏర్పడడం వంటి లక్షణాలతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు, మెరుగైన వైద్యం కోసం గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. ఆ తర్వాత మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించారు.



ఆమె రక్త నమూనాలను పరీక్షించగా స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలతో మరణించినట్లు వెల్లడైంది. రాజుపాలెం మండలం కొత్తూరు పులిచింతల పునరావాస కేంద్రంలో నివసిస్తున్న నాగమ్మ (62) 15 రోజుల క్రితం మరణించారు. ఇదే మండలం కోత్తూరులో స్క్రబ్ టైఫస్ లక్షణాలతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సాలమ్మ (72) చికిత్స పొందుతున్నారు. స్క్రబ్ టైఫస్ అనేది ఒక బ్యాక్టీరియా అని, పొలాలు, గుబురుగా ఉండే పొదలలో నల్లిసైజుల్లో ఎనిమిది కాళ్లతో ఉండే పురుగు కుడితే తీవ్ర జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయని డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ తెలిపారు. ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స పొందకపోతే ఇబ్బందులు వస్తాయని చెప్పారు. బ్యాక్టీరియా కుట్టిన నాలుగు నుంచి పది రోజుల తరువాత వ్యాధి లక్షణాలు బయటపడతాయని, జ్వరం, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, దద్దుర్లు, శరీరం పై నల్లటి మచ్చలు వచ్చే అవకాశం ఉందన్నారు.

# పోలవరం ప్రాజెక్టు పనులు 88 శాతం పూర్తి

### ఎజలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**పోలవరం : డిసెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పోలవరం ప్రాజెక్టు పనులు ఇప్పటికి 88 శాతం పూర్తి చేశామని, 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గురువారం పోలవరం ప్రాజెక్టు పనులను మంత్రి పరిశీలించారు. ప్రాజెక్టులో గ్యాప్-1, గ్యాప్-2, కుడి ప్రధాన కాలువ జంట గుహలు, హెడ్ రెగ్యులేటర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్లు, మ్యాప్ పాయింట్లను తిలకించారు. ఇంజనీరింగ్ చీఫ్ ఎన్.నరసింహమూర్తి, ఎస్ఇ రామచంద్రరావు, మెగా ప్రతినిధులు అంగర సతీష్, గంగాధర్ మంత్రికి పనుల పురోగతిని వివరించారు. అనంతరం జలవనరులశాఖ అధికారులు, మెగా కాంట్రాక్టర్లు, ఇతర ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ డయాఫ్రం వాల్‌లో ఇప్పటికే 950 మీటర్ల నిర్మాణం పూర్తయ్యి, 75 శాతం పనులు ముగిశాయని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రెండు శాతం పనులు మాత్రమే చేస్తే, కూటమి ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 12 శాతం పనులు పూర్తి చేసిందన్నారు. క్లిష్టమైన టన్నెల్స్ లైనింగ్ పనులతో ఉన్న రైట్ కనెక్టివిటీస్ 82 శాతం, లెఫ్ట్ కనెక్టివిటీస్ 62 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. వర్షాకాలంలో కూడా నిర్మాణాలు ఆగకుండా ఉండేందుకు బట్రస్ డ్యామ్ నిర్మాణం పూర్తిచేసినట్లు తెలిపారు. వచ్చే ఫిబ్రవరి నాటికి కొత్త డయాఫ్రం వాల్‌ను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. నిర్వాసితులకు ఒక్క ఏడాదిలోనే రూ.రెండు వేల కోట్లు అందజేసి వారి పునరావాసానికి అండగా నిలిచింది చంద్రబాబు ప్రభుత్వం అన్నారు. ఎడమ ప్రధాన కాలువ పనులను పూర్తి చేసి 2026 నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలను చేర్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సలహాదారులు ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ డి.ప్రశాంతి, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.



# సుప్రీంకోర్టులో రాహుల్‌గాంధీకి ఉపశమనం

న్యూఢిల్లీ : భారత ఆర్మీపై అనుచిత వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఉపశమనం లభించింది. రాహుల్‌గాంధీపై ట్రయల్ కోర్టు చర్యలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు గురువారం మధ్యంతర ఉత్తర్వులను 2026, ఏప్రిల్ 22 వరకు పొడిగించింది. రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ సతీష్ చంద్రలతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఈ అంశాన్ని వివరంగా విచారిస్తామని తెలిపింది. 2022లో చేపట్టిన భారత్ జోడోయాత్రలో రాహుల్‌గాంధీ భారత సైన్యంపై అవమానకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై ఫిర్యాదుదారు ఉదరు శంకర్ శ్రీవాస్తవ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ట్రయల్ కోర్టు సమన్లు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ రాహుల్‌గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు మే 29న కొట్టివేసింది. దీంతో ఈ ఉత్తర్వులపై రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఆగస్టు 4న రాహుల్ గాంధీ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. తదుపరి విచారణ తేదీ వరకు స్టే విధించింది.



# ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు శస్త్రచికిత్స

### కిడ్నీలో రాళ్ల తొలగింపు కోసం ఆపరేషన్

### ప్రస్తుతం తాను కోలుకుంటున్నట్లు వెల్లడి

**అమరావతి డిసెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు గురువారం శస్త్రచికిత్స చేయించుకున్నారు. కిడ్నీలో రాళ్ల సమస్య కారణంగా ఆయన ఈరోజు ఉదయం వైద్య చికిత్స తీసుకున్నారు. ప్రస్తుతం తన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నానని ఆయన స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు రఘురామకృష్ణరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈరోజు ఉదయం నేను కిడ్నీలో రాళ్ల తొలగింపు కోసం శస్త్రచికిత్స చేయించుకోవడం జరిగింది. ప్రస్తుతం నేను కోలుకుంటున్నాను" అని ఆయన తెలిపారు. తనకు అద్భుతమైన వైద్య సేవలు అందించిన వైద్య బృందానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే, తన శ్రేయస్సును ఆకాంక్షించిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు కూడా రఘురామ కృతజ్ఞతలు చెప్పారు.



తెలుగురాష్ట్రం దినపత్రిక

## గాంధీ నగర్ పార్కులో
# సమస్యలను పరిష్కరించండి



**కాకినాడ, డిసెంబర్ 4 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** గాంధీనగర్ పార్కు పరిశీలనకు వచ్చిన కమిషనర్ కు పార్కులోని వాకర్స్, ప్రజలు, టిడిపి నాయకులు 41 వ వార్డు ఇంచార్జ్ జొన్నాడ వెంకటరమణ, జనసేన వీర మహిళలు పార్కులో నెలకొన్న సమస్యలను వివరించి వాటిని పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను క్షుణ్ణంగా విన్న ఇంచార్జ కమిషనర్ వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేషన్ నిధులతో ప్రస్తుతానికి చేయగలిగిన పరిష్కరించదగ్గ సమస్యలను తీర్చేటందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన 38 వార్డు ఇంచార్జ్ సభ్య దీప్తి, 39 వార్డ్ సెక్రటరీ బండి సుజాత, 44 వైస్ ప్రెసిడెంట్ మట్టపర్తి మోహన కుమారి, పార్క్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పిల్లి శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ కే. శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ ప్రతాప్ వెంకటేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నీటిని శుద్ధి చేయవచ్చు
### లించోపింగ్ విశ్వ విద్యాలయం సహాయ ఆచార్యులు డాక్టర్ దుర్గా శంకర్



**తాడేపల్లిగూడెం, డిసెంబర్ 4(తెలుగురాష్ట్రం విలేకరి)** : అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సాయంతో శుద్ధి చేసిన నీటిని ప్రజలకు అందించవచ్చని లించోపింగ్ విశ్వవిద్యాలయం (స్వీడన్) సహాయ ఆచార్యులు డాక్టర్ దుర్గా శంకర్ వావిలపల్లి సూచించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లోని మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నీటి శుద్ధీకరణకు స్థిరమైన సాంకేతికతలు, భవిష్యత్తు కోసం అధునాతన పదార్థాలను ఉపయోగించటం అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ ఇంచార్జ్ విభాగాధిపతి డాక్టర్ సంతోష్ కుమార్ బెహర అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ దుర్గా శంకర్ మాట్లాడుతూ పరిశుభ్రమైన నీరు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని, కలుషిత నీటిని తాగితే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదాలున్నాయని చెప్పారు. తాగునీటి వనరులు కలుషితం కాకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పరిశ్రమలు, ఆసుపత్రుల నుంచి వెలువడే వ్యర్థాలు, మలినాలలో విషపూరితమైన పదార్థాలు ఉంటాయని, అవి నీటిలో చేరితే ఆ జలాలు కలుషితమవుతాయని తెలిపారు. ఫోటో కాటలిసేస్, నానో టెక్నాలజీ వంటి అధునాతన టెక్నాలజీల పరిజ్ఞానం సాయంతో నీటిని శుద్ధి చేస్తే హానికరమైన వ్యర్థాలు, మలినాలు సైతం తొలగిపోతాయని చెప్పారు. ప్రజల ఆరోగ్య రక్షణకు స్వచ్ఛమైన, పరిశుభ్రమైన, సురక్షితమైన తాగునీటిని అందించేందుకు ఈ నూతన సాంకేతికత పరిజ్ఞానం ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్యులు డాక్టర్ సంతోష్ కుమార్ బేహార మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం డాక్టర్ దుర్గా శంకర్ ను, ఆచార్యులు జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ ఆర్ సునీల్ కుమార్, డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఎస్.రాథోడ్, డాక్టర్ వి.వి.సత్యప్రసాద్, డాక్టర్ అల్లంశెట్టి శ్రీకాంత్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ తపస్, డాక్టర్ వినోత్ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ రాజ్ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చిన
# ఘనత కూటమి ప్రభుత్వానిదే
### -శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, డిసెంబర్ 4 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** పంచాయతీ రాజ్ వ్యవస్థలో పెను మార్పులు తీసుకోచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా నిర్మించిన మొత్తం 77 డివిజనల్ డెవలప్మెంట్ అధికారి (డిడివో) కార్యాలయాలను ఏపీ డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవం చేయగా, తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో నూతనంగా నిర్మించిన డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయాన్ని గురువారం ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు దేశానికి పట్టుగొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని చెప్పారు. రాష్ట్రం పదికాలాలుపాటు సుభిక్షంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం, నాయకులు అహొర్నిశలు శ్రమిస్తున్నారని కితాబిచ్చారు. ప్రజల వద్దకే పరిపాలనను తీసుకొచ్చి, వారికి మెరుగైన సేవలందించేందుకు ఈ డీడీవో కార్యాలయాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. డివిజనల్ స్థాయిలో చేపట్టే వివిధ రకాల అభివృద్ధి పనులను ఇప్పటి నుంచి ఢీడీవోలే పర్యవేక్షిస్తారని, తద్వారా గ్రామాల్లో మౌళిక వసతుల కల్పన సులభతరం అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ పోతుల అన్నవరం, తెదేపా మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, సొసైటీ చైర్మన్ పరిమి వెంకట కృష్ణ, నాయకులు పుల్లా బాబీ, మద్దిపాటి రవితేజ, పాలూరి వెంకటేశ్వరరావు, రామ్ లక్ష్మణ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఆదివాసి పూజర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి
## ఎస్టి కమిటీ చైర్మన్‌కు వినతిపత్రం




**కూనవరం, డిసెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఆదివాసీ పూజర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి, షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ తో పాటు ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ కు ఆదివాసీ సంక్షేమ పరిషత్, జేఏసీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఐదు షెడ్యూల్ ప్రాంతాలలోనే ఆదివాసి గ్రామాలకు ఐటీడీఏ, గిరిజన మంత్రిత్వ శాఖ ద్వారా ఆదివాసుల దేవాలయాల అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను ఇవ్వాలని అన్నారు. ప్రకృతిగా ఆరాధకులు గుర్తిస్తూ మతాలకు మత గురువులకు కల్పించే సంక్షేమ పథకాలను కల్పించడం ద్వారా ఆదివాసి గ్రామాలలో ఉన్న ఆదివాసి దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని ఎస్టి కమిటీ చైర్మన్, కమిషనర్లకు వివరించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఆదివాసి కల్లుగీత కార్మికులకు బీమా సదుపాయం కల్పించాలని, అన్ని షెడ్యూల్ ప్రాంతాలలోని కల్లుగీత కార్మికులకు సొసైటీలు ఏర్పాటు చేసి వారికి బీమా సదుపాయాన్ని కల్పించాలని, తాటి, ఇప్ప చెట్ల వలన అడవిలో లభించే ఉత్పత్తుల ద్వారా ఆదివాసి యువతీ, యువకులకు ఏజెన్సీ ప్రాంతాలలోనే ఉపాధి కల్పించే విధంగా ఐటీడీఏలో పని చేస్తున్న సూచించారు. ప్రభుత్వ అధికారులు ప్రణాళికల రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. షెడ్యూల్ ప్రాంతాలలో ఆదివాసి యువతీ, యువకులకు ఉద్యోగ భద్రత చట్టాన్ని కల్పించాలని, షెడ్యూల్ ప్రాంతాలలోని ఆదివాసి యువతీ, యువకులకు విద్యాబుద్ధులు నేర్పించి బిఈడి, డీఈడీలు చేయించిన విద్యార్థులు ఉపాధి హామీ కూలీలుగా చేపల చెరువులో కూలీల గాను పశువులు కాపర్లు తిరుగుతున్నారని 1/70, పీసా చట్టం నెంబర్ త్రీలో ఉన్నప్పుడు షెడ్యూల్ ప్రాంతాలలో గిరిజనేతులకు ఎలా ఉద్యోగాలు ఇస్తారని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలవరం ప్రాజెక్టులో పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ద్వారా ఆదివాసీ యువతి యువకులకు పూర్తి పరిహారము చెల్లించి భూములకు భూములు కల్పించిన తర్వాత మాత్రమే తరలించాలని, తాటి మామిడి చెట్లకు ఇతర చెట్లకు కూడా పరిహారం కల్పించాలని అన్నారు. ప్రాజెక్టులో నష్టపోతున్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఉద్యోగాలలో విద్యుత్ ప్రాజెక్టులలో కల్పించాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోడే మురళి, కారం రామన్న దొర, వెలగడ నాగేశ్వరావు, మడకం బుచ్చిరాజు, కుంజా వెంకన్న దొర, వెంకన్న దొర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర పవిత్రోత్సవాలు



**కాకినాడ, డిసెంబర్ 4 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** మార్గశిర మాసం సందర్భంగా స్థానిక రాగంపేట వేంచేసి ఉన్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర పవిత్రోత్సవాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా 108 మంది కన్యలచే పవిత్ర కలశాలతో నగరసంచారం చేసి అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు తదుపరి కలవ పువ్వులతో, గాజులతో, పసుపు కొమ్ములతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కనకమహాలక్ష్మి ఆలయ కమిటీ అధ్యక్షులు సంకురు గోవిందరాజులు రెడ్డి, ఉపాధ్యక్షులు అనసూయ కృష్ణ, కోశాధికారి గుర్తి శ్రీను, సంయుక్త కార్యదర్శి కప్పా రామారావు, కమిటీ సభ్యులు చిట్నీడి దారా ప్రసాద్, చింతాడ సూరిబాబు, అనసూరి సూర్య అర్జున్, బాకీ సత్తిబాబు, గంట నూకరాజు, డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో ఎమ్మెల్యే సత్యప్రభ



**ఏలేశ్వరం, డిసెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేకరి):** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఏలేశ్వరం భవిత కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్య ప్రభ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులతో కొద్ది సమయం గడిపారు. ఈ సందర్భంగా వారికి ఆటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు ఎమ్మెల్యే సత్య ప్రభ బహుమతులను అందజేశారు. అనంతరం చిన్నారులకు వడ్డించి, కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ, “దివ్యాంగులు అత్యంత ధైర్యవంతులు. వారిని సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవించాలి. వారి హక్కులు, భద్రత కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత” అని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార, భూ సంరక్షణ అవగాహన



**రౌతులపూడి, డిసెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేఖరి):** మండల వ్యవసాయ శాఖ, ఆత్మ అధికారులు రౌతులపూడి మండలం ఏ మల్లవరం గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు భూసార పరీక్షలపైన, భూ సంరక్షణ కొరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు భూసార పరీక్షల ఆవశ్యకత, ప్రాధాన్యత మట్టి నమూనాలు సేకరించే విధానం తీసుకోవలసిన జాగ్రత్తలు, మట్టిలో ఉన్న స్థూల సూక్ష్మ పోషకాలు గురించి, భూసార పరీక్ష పత్రం అంశాలపై ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రెడ్డి ఈశ్వరరావు, ఎస్.టి.ఎల్.ఎ.ఒ ఎన్. విజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎన్. సాయి, సైన్స్ టీచర్ ఆర్. రాజు, బి.టి.ఎమ్. ఎన్. బాబురావు, వ్యవ సాయ సహాయకులు సతీష్ పాల్గొన్నారు

## టిడిపి మండల ప్రధాన కార్యదర్శిగా పాయం ఎన్నిక



**వి.ఆర్.పురం, డిసెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేఖరి):** అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్ పురం మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా పాయం రామారావును లాంఛనంగా ఎన్నుకున్నారు. గురువారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఆయన ఎన్నిక పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజలకు సత్వరమైన సేవలు అందించే విధంగా డివిజనల్ డెవలప్మెంట్ కార్యాలయాలు



**రంపచోడవరం, డిసెంబర్ 4(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** రాష్ట్రంలో పంచాయతీల పరిధిలో ప్రజలకు సత్వరమైన వివిధ రకాలైన సేవలు అందించే విధంగా డివిజన్ స్థాయిలో డివిజనల్ డెవలప్మెంట్ అధికారి వారి కార్యాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ వర్చువల్ ప్రోగ్రాం ద్వారా తెలిపారు. గురువారం రంపచోడవరం గ్రామంలోని డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయం వర్చువల్ ప్రోగ్రాం ద్వారా ప్రారంభోత్సవానికి ఐటీడీఏ ఏపీవో జనరల్ డిఎన్వి రమణ, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కే.కోటేశ్వరరావు, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారిని యం.సావిత్రి ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా నుండి ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయితీ, రూరల్ డెవలప్మెంట్ కార్యాలయాలు ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే విధంగా రాష్ట్రంలో 77 డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రతి పంచాయతీలో త్రాగునీరు, పారిశుధ్య కార్యక్రమాలు, డ్రైనేజీ తదితర కార్యక్రమాలు ఎప్పటికప్పుడు పరిరక్షించే విధంగా ఈ డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయాలు దోహదపడతాయని ఆయన అన్నారు. ఈ డివిజనల్ డెవలప్మెంట్ కార్యాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయం,ఉపాధి హామీ పథకం ఎపీడీ కార్యాలయం మొత్తం మూడు కార్యాలయాలు ఉంటాయని ఆయన తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో రాష్ట్ర మొత్తం మీద సుమారు పదివేల మందికి వివిధ కేడర్ల వారికి ప్రమోషన్స్ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు.ఉపాధి హామీ పథకం ద్వారా ఆయా గ్రామాలలో ఉపాధి కార్యక్రమాల ద్వారా గ్రామాలు అభివృద్ధి చేయుటకు ఈ కార్యాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని అదేవిధంగా జాబ్ కార్డ్ ఉన్న ప్రతి వారికి ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కె. కోటేశ్వరరావు నూతన కార్యాలయ భవనంలో వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని పట్టుకొని వేదమంత్రాలతో భవనం లోపలికి ప్రవేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు ప్రసాద్, లక్ష్మణ్, కుమార్, సాల్మన్ రాజ్, కిషోర్, డిప్యూటీ ఎంపీడీవో వై. రాజు, ఉపాధి హామీ పథకం ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శి కామరాజు, అదే విధంగా పంచాయతీ సచివాలయాలకు సంబంధించిన కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# 100 కోట్లతో జగ్గంపేట అభివృద్ధి



**జగ్గయ్యపేట, డిసెంబర్ 4 (తెలుగురాష్ట్రం విలేకరి)**: మున్సిపాలిటీ చరిత్రలో కనీవిని ఎరుగని విధంగా ఏకకాలంలో రూ.100కోట్ల, 67లక్షల,41వేల,317 రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రకటించారు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి సంబంధించి, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అభివృద్ధి పనులకు నిధుల మూలం: ఒకేసారి అనేక పథకాల నుండి సమీకరణ జగ్గయ్యపేట మున్సిపాలిటీకి ఈ భారీ నిధులు వివిధ ప్రత్యేక అభివృద్ధి పథకాల ద్వారా సమకూరాయని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వివరించారు. ఈ నిధులను జిల్లా మైనింగ్ ఫండ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్, కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకమైన అమృత్ 2.0, స్వచ్ఛ ఆంధ్ర సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నుండి కేటాయించడం జరిగింది. వివిధ ప్రభుత్వ వనరుల నుండి ఇంత పెద్ద మొత్తంలో నిధులను సాధించడం జగ్గయ్యపేట చరిత్రలో ఇదే మొదటిసారి కావడం విశేషం. మండలి చరిత్రలో ఇదే అత్యధిక నిధుల కేటాయింపు. ఈ నిధులతో జగ్గయ్యపేట మున్సిపాలిటీ రూపురేఖలను శాశ్వతంగా మార్చేస్తాం. వచ్చే నెల నుంచే యుద్ధప్రాతిపదికన ఈ పనులను ప్రారంభిస్తాం" అని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు ఈ రూ.100 కోట్ల నిధులతో కేవలం కొన్ని పనులు మాత్రమే కాకుండా, మున్సిపాలిటీలోని ప్రతి రంగాన్ని అభివృద్ధి చేసే సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, బ్రిడ్జి నిర్మాణాలు, తాగునీటి సరఫరా సమస్యకు శాశ్వత పరిష్కారం. నీటి శుద్ధి మరియు సరఫరా కేంద్రాన్ని మరింత సామర్థ్యంతో ఆధునీకరణ. పట్టణ సౌందర్యం, చెరువు అభివృద్ధి మరియు గ్రీనరీ జగ్గయ్యపేట గా అత్యద్భుతంగా అభివృద్ధి చేయడం, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయడం. దీని ద్వారా పట్టణ ప్రజలకు ఒక పర్యాటక మరియు విశ్రాంతి కేంద్రం లభిస్తుంది. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఆధునిక వ్యర్థాల నిర్వహణ, చెత్త విభజన మరియు ట్రీట్‌మెంట్, దాని ట్రాన్స్‌పోర్ట్‌ను పటిష్టం చేయడం. దీని ద్వారా మున్సిపాలిటీ పరిధి పరిశుభ్రంగా మారుతుంది. మెరుగైన వీధి దీపాలు, స్ట్రీట్ లైటింగ్ వ్యవస్థ అభివృద్ధి, దీనివల్ల నేరాలను అరికట్టడం మరియు ప్రజలకు భద్రత పెంచడం లక్ష్యం. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ, "మా ప్రభుత్వ లక్ష్యం పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడం. ఈ 100 కోట్లతో కేవలం భవనాలు, రోడ్లు మాత్రమే కాకుండా, ప్రజల కష్టాలను తీర్చేందుకు, జగ్గయ్యపేటను ఒక ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ఈ పనులు ఉపయోగపడతాయి. పనులన్నీ త్వరితగతిన, పారదర్శకంగా పూర్తయ్యేలా నేను మరియు మున్సిపల్ చైర్మన్ పర్యవేక్షిస్తాం" అని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలక వర్గం కౌన్సిలర్లు, కమిషనర్ తులసి వెంకటకృష్ణారావు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వికలాంగులకు రూ. 15 వేలు పెన్షన్ మంజూరు చేయాలి -శాసనసభ్యులు బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం, డిసెంబర్ 4 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** తమ కాళ్ళ మీద తాము నిలబడలేని నూరు శాతం వికలాంగులను ప్రభుత్వం గుర్తించి వారికి పూర్తిస్థాయిలో పెన్షన్ ను మంజూరు చేయాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. నియోజకవర్గంలో 100 శాతం మానసిక, శారీరిక వికలాంగత్వంతో బాధపడుతున్న పలువురు వికలాంగులను గుర్తించారు. వారికి రూ 15 వేలు వికలాంగ పెన్షన్ మంజూరు కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి డాక్టర్లతోను, ఏలూరు మెడికల్ బోర్డు అధికారులతోను ఎమ్మెల్యే బొలిశెట్టి ఫోన్ లో మాట్లాడారు. వికలాంగులను పరిశీలన నిమిత్తం తన సొంత డబ్బులతో రవాణ, భోజన ఏర్పాట్లు చేయించటంతోపాటు వికలాంగులను నాలుగు అంబులెన్సులలో గురువారం ఏలూరు పంపించి తన ఉదారతను, సేవా గుణాన్ని, మానవత్వాన్ని ఎంతో ఘనంగా చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి పేదవానికి, వికలాంగులకు న్యాయం చేయాలన్నదే తన అభిమతమని చెప్పారు. తన హయాంలో అర్హులెవ్వరూ నష్టపోకూడదనే సంకల్పంతోను, ప్రభుత్వం నుంచి వారికి వికలాంగులకు దక్కాల్సిన పూర్తి రాయితీలు, ప్రోత్సాహాలు వారికి ఇప్పించటమే ధ్యేయంగా ముందుకెళు న్నానని తెలిపారు. నూరుశాతం వికలాంగత్వం ఉన్నవారికి పూర్తి పెన్షన్ వస్తే, ఆ కుటుంబానికి కొంత ఆసరాగా నిలుస్తుందని వివరించారు.

## ఈతకోటలో కనకదుర్గమ్మ ఆలయంలో శాస్త్రోక్తంగా చండీహోమం



**ఈతకోట, డిసెంబరు 4( తెలుగు రాష్ట్రం)**
మార్గశిర పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఈతకోట గ్రామంలోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో గురువారం ఉదయం చండీహోమం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకన్న, ఖండవల్లి సూర్యనారాయణ ఆచార్యులు (నాని) వేదోచ్చారణల నడుమ అగ్నిస్థాపన చేసి, శాస్త్రోక్త విధానాలతో హోమాన్ని నిర్వహించారు. గ్రామం నిండా ప్రతిధ్వనించిన మంత్రోచ్చారణలు, హోమకుండంలో జ్వలించిన అగ్నిజ్యోతి భక్తులను ఆహ్లాదభరితుల్ని చేశాయి. చండీహోమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ దంపతులు, కంచర్ల సాంబమూర్తి దంపతులు, మద్దూరి నాగేశ్వరరావు దంపతులు, చెక్కా బాబురావు కుటుంబ సభ్యులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జనిపిరెడ్డి గోవిందరావు, వైస్ ప్రెసిడెంట్ వత్సవాయి బాబి, కమిటీ సభ్యులు కొప్పినీడి రామకృష్ణ, రాచకొండ రాముడు, గంధ్రోతు సత్యనారాయణ (జగం), కొట్టు సత్యనారాయణ, అడబాల వెంకట కృష్ణారావు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. హోమం ముగిసిన అనంతరం ఆలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణం పౌర్ణమి పర్వదినోత్సాహంతో కళకళలాడిందని కమిటీ సభ్యులు తెలిపారు.

## శిథిలాల్లో చదువులు

### బాసింగి కొత్తూరు పాఠశాల చిన్నారుల భద్రత ప్రమాదం.

**చింతపల్లి, డిసెంబర్ 04 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**
చింతపల్లి మండలంలోని తాజంగి పంచాయతీ పరిధిలో ఉన్న బాసింగి కొత్తూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని చిన్నారుల ప్రాణాలను సైతం ప్రమాదంలోకి నెడుతోంది. కేవలం కొన్నేళ్ల క్రితమే నిర్మించిన ఈ భవనం ఇప్పుడు గోడలు పగిలి, పైకప్పు కూలే పరిస్థితికి చేరడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలి



వర్షాల్లో పైకప్పు చిట్లిపడి నీరు కారిపోవడంతో క్లాస్ రూములు చిన్న నీటి గుంటలుగా మారిపోయాయని ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. గోడలు నారిపోవడం, పెచ్చు ఒక్కసారిగా ఊడిపడటం వల్ల విద్యార్థులు భయంతో తరగతులకు హాజరయ్యే దుస్థితి ఏర్పడింది. ప్రత్యేకించి ఒక రోజు పెచ్చు ఊడి పడటంతో పిల్లలు భయంతో పరుగులు పెట్టిన ఘటన తల్లిదండ్రుల్లో భయాందోళన పెంచింది. పాఠాలు వినడం, పుస్తకాలు తడవడం, తరగతులు తరచుగా నిలిచిపోవడం వంటి ఇబ్బందులు చిన్నారులను వేధిస్తున్నాయి. కొన్నిసార్లు పాఠశాలను చెట్ల నీడలోనే నిర్వహించే పరిస్థితి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. "పిల్లలను స్కూల్‌కు పంపితే గుండెల్లో గుబులు%ౌ% పైకప్పు ఎప్పుడు పడుతుందోనన్న భయం ఎప్పుడూ వెంటాడుతోంది" అని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం పరిస్థితిపై గత మూడు ఏళ్లుగా గ్రామస్తులు, ఎస్సీ కమిటీ సభ్యులు అనేకసార్లు విద్యా శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత విచారణలు పెట్టడం, ఓదార్పు చెప్పడం ఎవరికీ ఉపయోగం కాదు%ౌ% ముందుగా చర్యలు తీసుకుంటేనే పిల్లల ప్రాణాలు రక్షించగలం అని గ్రామ పెద్దలు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుత భవనాన్ని వెంటనే కూల్చి, చిన్నారులకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కొత్త పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడిన ఈ పరిస్థితిపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారు?%-%అనే ప్రశ్న ఇప్పుడు బాసింగి కొత్తూరులో చర్చనీయాంశమైంది.

## ప్రేమ, పోరాటాల కలబోత మోగ్లీ (2025)

### -రాజమండ్రిలో సందడి చేసిన మోగ్లీ మూవీ టీం



**రాజమహేంద్రవరం, డిసెంబర్ 4 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
యువ సంచలనం రోషన్ కనకాల హీరోగా విభిన్న దర్శకుడు సందీప్ రాజ్ తెరకెక్కించిన 'మోగ్లీ (2025)' చిత్రం విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. డిసెంబర్ 12న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా చిత్ర యూనిట్ గురువారం రాజమండ్రిలోని ఎఫ్ కేఫ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రంలో ప్రేమలోని నూతన కోణాన్ని చూపించబోతున్నట్లు యూనిట్ తెలిపింది. హీరో రోషన్ కనకాల మాట్లాడుతూ 'మోగ్లీ' సినిమా ఒక యూనిక్ ఫిల్మ్. ఒక సాధారణ యువకుడిగా, నేను నా పాత్ర కోసం చాలా పరిశోధన చేశాను. ఈ కథ ప్రేక్షకులను వారి మొదటి ప్రేమ జ్ఞాపకాలకు తీసుకెళ్తుంది. ముఖ్యంగా దర్శకుడు సందీప్ రాజ్ విజన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సినిమా విజయంపై మేము చాలా నమ్మకంతో ఉన్నాము అన్నారు ప్రతి ఒక్కరూ థియేటర్‌లో చూసి, మంచి సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నాను అని ఓ కొత్త ప్రేమ కథని అందరూ చూడబోతున్నారు అన్నారు. విశాఖపట్నం పాడేరు, పార్వతీపురం దీని చుట్టూ ఉన్న ఏరియాలోనే ఎక్కువ షుటింగ్ జరిగిందని, ఈ సినిమాలో హర్ష కామెడీ, కాళభైరవ మ్యూజిక్ హైలైట్‌గా నిలుస్తాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మాపై ఉంచిన నమ్మకానికి ధన్యవాదాలు. 'మోగ్లీ' అనేది కేవలం సినిమా కాదు, యువత లైఫ్ ఎమోషన్ ఫీల్ అయ్యే ప్రేమ కథ అని తెలిపారు. డిసెంబర్ 12న గ్రాండ్‌గా రిలీజ్ అవుతోందని, అందరూ ఆదరించాలని కోరారు. విశాఖపట్నం అంటే తమకి సెంటిమెంట్ అని అందుకే ప్రమోషన్ విశాఖ నుండే ప్రారంభించాం అన్నారు. అనంతరం హీరోయిన్ సాక్షి మాట్లాడుతూ విశాఖపట్నం నాకు చాలా ఇష్టమైన ప్లేస్ అని మా మోగ్లీ ప్రమోషన్స్ ఇక్కడ మొదలవడం సంతోషంగా ఉంది అని తెలిపారు. ఈ సినిమాలో నాది డెఫ్ అండ్ మ్యూట్ అయిన అమ్మాయి పాత్ర. మాటలు లేకపోయినా, కళ్లతోనే భావాలను పలికించాల్సి వచ్చింది అని ఇది నాకు చాలా ఛాలెంజింగ్ రోల్. రోషన్, సందీప్ చాలా సపోర్ట్ చేశారు అన్నారు. ట్రైలర్‌లో చూసిన ఇంటెన్సిటీతో పాటు, సినిమాలో అందమైన లవ్ స్టోరీ, గొప్ప ఎమోషన్ ఉంటుందన్నారు. ?కమెడియన్ హర్ష చెముడు మాట్లాడుతూ "నేను చేసిన కామెడీ పాత్ర ఈ సినిమాలో చాలా కీలకం. కేవలం నవ్వించడం కోసమే కాకుండా, హీరో రోషన్ జర్నీలో నా పాత్ర ఒక బ్రిడ్జ్ లాగా ఉంటుంది. ఈ సినిమా కథ చాలా సీరియస్‌గా ఉంటుంది, దానికి తగ్గట్టుగా నా పాత్ర ద్వారా కామెడీ డోస్ కొంచెం లైట్ చేస్తుంది అని డైరెక్టర్ సందీప్ రాజ్ నా పాత్రను చాలా బాగా డిజైన్ చేశారని తెలిపారు. తప్పకుండా థియేటర్లలో నవ్వుకుంటారని తెలిపారు.

## అరుగోలనులో భక్తాంజనేయ స్వామికి లక్ష అరటి పండ్లు పూజ

**తాడేపల్లిగూడెం, డిసెంబర్ 4 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):**
తాడేపల్లిగూడెం మండలం ఆరుగోలనులోని భక్తాంజనేయ స్వామివారి ఆలయంలో ఎన్డికె బ్రదర్స్ అధ్యర్యంలో హనుమాన్ వ్రత మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సీతానగరం వాస్తవ్యులు చిట్టిబాబు సిద్ధాంతి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు గోదావరి సీతారామశర్మ కుమారుల పర్యవేక్షణలో నూకల బులియ్య-ఆనంతలక్ష్మి దంపతులు, పడాల మధు - దుర్గ దంపతులు కలిసి విఘ్నేశ్వర పూజ, పుణ్య హావచన, రక్షబంధన్, పంచగావ్య ప్రయసం, ఋుకృత్వరుణ, మండపరాధన, సీతా రామ లక్ష్మణ సపరివార సమేత



పంచముఖ ఆంజనేయస్వామి ఆరాధన, సప్త ఋషి, ఏకాదశ రుద్రులు ద్వాదశ ఆదిత్యత వాగేర్ ,సంపూర్ణ సుందరకాండ పారాయణం, స్వామి వివిధ రకాల పండ్లు, ద్రవ్యాలతో అభిషేకం, పూజలు నిర్వహించారు. సుందరకాండ హోమం వంటి పూజలు నూకల ధనకృష్ణ దంపతులు జరిపించారు. అనంతరం భక్తాంజనేయ స్వామి వారికి ఎంతో ప్రీతికరమైన లక్ష అరటిపండ్లు పూజా కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం పూర్ణహుతి చేసి స్వామివారి పూజలు ముగించారు. ప్రజలందరూ విద్య , వైద్య ఉద్యోగ వ్యవసాయం, కళ్యాణ, సంతాన ప్రాప్తి కలగడంతో పాటు సమస్త దోషాలు తొలగిపోతాయని తెలిపారు. ఈ పూజలు చేయటం వల్ల ఎంతో పుణ్యం వస్తుందని చెప్పారు. ఈ పూజలలో 50 జంటలు, భక్తులు పాల్గొన్నారు.

## కొత్తపేట డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం ప్రారంభం

**కొత్తపేట, డిసెంబరు 4( తెలుగు రాష్ట్రం )**
రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 77 డివిజనల్ అభివృద్ధి అధికారి (%ణణఉ%) కార్యాలయాలను ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి మంత్రి గౌ. శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. చిత్తూరులో జరిగిన ప్రధాన కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి, అనంతరం రాష్ట్రంలోని మిగతా 76 డివిజనల్ కార్యాలయాలను ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. కొత్తపేట డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం వాడపాలెం గ్రామంలో ప్రారంభమైంది. గౌరవ శాసన సభ్యుల ఆదేశాల మేరకు యువ నాయకులు గౌ. శ్రీ బండారు సంజీవ్, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ బండారు శ్రీనివాస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్ అభివృద్ధి పరంగా కొత్త అవకాశాలు, వేగవంతమైన పరిపాలనా సేవలు అందుబాటులోకి రానున్నాయని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్తపేట మండల పరిషత్ అధ్యక్షులు శ్రీ మార్గాన గంగాధర్, జడ్‌పిటిసి సభ్యురాలు శ్రీమతి గూడపాటి రమాదేవి, అంబాజీపేట మండల పరిషత్ అధ్యక్షులు గౌ. శ్రీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, డివిజనల్ అభివృద్ధి అధికారి శ్రీ ఎస్.టీ.వి. రాజేశ్వరరావు పాల్గొన్నారు. డివిజన్‌కు చెందిన ఏడు మండలాల నుండి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, ఎంపిడిఒలు, డిప్యూటీ ఎంపిడిఒలు, ఇతర శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. DDO కార్యాలయం ప్రారంభంతో అభివృద్ధి పనుల పర్యవేక్షణ, గ్రామస్థాయి సమస్యల పరిష్కారం





అల్లవరం మండలం, కొమరగిరిపట్నం సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన గౌరవ ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు గారు మరియు రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు గారు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు గారు

## లంబసింగి కొండ రోడ్డులో
# ఘోర ప్రమాదం..
## లోయలో పడిన ఆటో

### గిరిజన మహిళ మృతి.

**రక్షణ గోడల లేమిపై ప్రజల ఆగ్రహం.**

**జున్నుల గ్రామంలో విషాద ఛాయలు-చిత్తడి రోడ్డే ప్రమాదానికి కారణమని స్థానికుల ఆరోపణ.**







**చింతపల్లి, డిసెంబర్ 04 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

అల్లూరి జిల్లా చింతపల్లి మండలం జున్నుల గ్రామంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని గ్రామాన్ని విషాదంలో ముంచేసింది. లంబసింగి కొండ రోడ్డులో చింతపల్లి నుంచి నర్సీపట్నం వైపు బయలుదేరిన ఆటో అదుపుతప్పి సుమారు 30 అడుగుల లోయలోకి బోల్తాపడింది. ఈ దుర్ఘటనలో జున్నుల గ్రామానికి చెందిన గిరిజన మహిళ కిలో సీతమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు, అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు గ్రామస్తులు అద్దెకు తీసుకున్న ఆటోలో ప్రయాణిస్తుండగా, లంబసింగి కొండ మార్గంలో ఉన్న ప్రమాదకర మలుపు వద్ద రోడ్డు పై పేరుకున్న చిత్తడి కారణంగా వాహనం జారిపడి నియంత్రణ కోల్పోయినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ఒక్కసారిగా ఒరుగిన ఆటో లోయలోకి దూసుకుపోవడంతో తీవ్ర విషాదం నెలకొంది. ఆటోలో ఉన్న 10 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడగా, వారిని వెంటనే నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం చోటుచేసుకున్న ప్రాంతంలో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు, పోలీసులు కలిసి రక్షణ చర్యలు చేపట్టి గాయపడిన వారిని పైకి తెచ్చారు. సీతమ్మ ఆకస్మిక మృతితో జున్నుల గ్రామంలో శోకసంద్రం అలుముకుంది. గ్రామస్తులు మృతదేహంపై కన్నీరు మున్నీరయ్యారు. కొండ రహదారి విస్తరణ లేకపోవడం, పక్కన రక్షణ గోడలు ఏర్పాటు చేయకపోవడమే ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతున్నాయని స్థానికుల ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రమాదంపై కేసు నమోదు చేసిన చింతపల్లి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడవలసి ఉంది.

## లంబసింగి ఘాట్‌లో ప్రమాద క్షతగాత్రులను పరామర్శించిన చింతపల్లి సీఐ వినోద్‌బాబు.

**చింతపల్లి, డిసెంబర్ 04 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**



ప్రమాదాలకు కేరాఫ్‌గా మారిన లంబసింగి ఘాట్ రహదారి మరోసారి రోదనలు రేపింది. గురువారం మధ్యాహ్నం జున్నుల గ్రామానికి చెందిన ప్రయాణికులతో నర్సీపట్నం వైపు వెళ్తున్న ఆటో కుదురుగా వంగిన మలుపు వద్ద అదుపు కోల్పోయి లోయలోకి బోల్తాపడింది. వేగం ఎక్కువగా ఉండటంతో ఆటో పల్టీలు కొడుతుండగా ప్రయాణికులు రోడ్డుపై, పక్కనున్న లోతులోకి పడిపోయారు. ఆ హడావిడిలో కిలో సీతమ్మ (45) మృతి చెందగా, మరో తొమ్మిది మంది తీవ్ర గాయాలతో మూర్ఛపోయారు. ఆపదలో ఘోష వినిపించడంతో స్థానికులు, ఇతర ప్రయాణికులు అప్రమత్తమై క్షతగాత్రులను బయటకు తీశారు. వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది స్పందించి వారిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. తీవ్ర గాయాలతో తల్లడిల్లుతున్న బాధితులకు అత్యవసర చికిత్స కొనసాగుతోంది. ఘటన తెలిసిన వెంటనే చింతపల్లి సీఐ ఎం. వినోద్‌బాబు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి చేరుకుని ఒకరు తర్వాత మరొకరిలా క్షతగాత్రులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి అదనపు వైద్య సహాయం అవసరమైతే వెంటనే అందిస్తామని భరోసా ఇచ్చారు. బాధితుల కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు. వేగం నియంత్రణ, వాహనాల ఫిట్‌నెస్, ఘాట్ రహదారిలో డ్రైవర్ల అప్రమత్తత అత్యంత కీలకం' అని ఆయన పేర్కొన్నారు. లంబసింగి ఘాట్ దారిలో ఇటీవలి కాలంలో ప్రమాదాలు వరుసగా పెరుగుతున్న నేపథ్యంలో స్థానికుల్లో ఆందోళన పెరిగింది. రహదారి పక్కన రక్షణ గోడలు, వేగ నిరోధక చర్యలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారు పునరుద్ఘాటిస్తున్నారు. ప్రమాద ప్రాంతాల్లో అదనపు గస్తీలు, వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని పోలీసులు కూడా యోచిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటన పర్వత ప్రాంతాల్లో రవాణా భద్రతపై మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని మరోసారి స్పష్టం చేసింది.

# ఆంధ్ర-కాశ్మీర్ లంబసింగిలో అమెరికా స్టాబెరీ సిరులు.
## వింటర్ డాన్'తో గిరి రైతుల ముఖాల్లో వికసిస్తున్న పూలు.



**చింతపల్లి, డిసెంబర్ 04 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**

అల్లూరి మన్యం కొండల్లో చలికి పేరుగాంచిన లంబసింగి ఇప్పుడు అమెరికా స్టాబెరీ సాగుతో కొత్త రుచిని, కొత్త ఆదాయాన్ని అందిస్తోంది. ఒకప్పుడు హిమాలయాల్లో మాత్రమే పండే యాపిల్, ఈశాన్య రాష్ట్రాల్లో కనిపించే ప్రత్యేక జాతి స్టాబెరీ ఇప్పుడు లంబసింగి ఆంధ్ర కాశ్మీర్ వాతావరణంలో సాఫల్యంగా పెరుగుతున్నాయి. గులాబీ కుటుంబానికి చెందిన ఈ పండు పుట్టిన దేశం అమెరికా. అక్కడి నుంచి వచ్చిన వింటర్ డాన్ రకం ఇప్పుడు గిరిజన రైతులకు ఆశాజ్యోతి అయింది.

**వింటర్ డాన్‌మన్యం నేలపై అద్భుతం.**

లంబసింగిలో 1995లో చింతపల్లి ఉద్యాన పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల తర్వాత స్టాబెరీ సాగుకు ఇక్కడి వాతావరణం అత్యంత అనుకూలమని నిర్ధారించారు. ఫలితంగా గిరి రైతులు కొద్దికాలంలోనే ఈ పంటను విజయవంతంగా అందిపుచ్చుకున్నారు. ప్రస్తుతం లంబసింగి



జంక్షన్, లంబసింగి, రాజుపాకలు, చిత్రాలగొప్పు గ్రామాల్లో మొత్తం 50 ఎకరాల్లో సాగు జరుగుతోంది. స్టాబెరీ పండు నేలకు తగలకుండా మొక్క చుట్టూ ఎండుగడ్డి వేయడం ప్రత్యేకత. అందుకే దీనికి 'స్ట్రా బెరి' అనే పేరు వచ్చిందని నిపుణుల వివరణ.

**పర్యాటకులుపండ్లకు ప్రత్యక్ష మార్కెట్.**

నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ లంబసింగి పర్యాటకులతో కిటకిటలాడుతుంది. ఈ సందర్శకులే స్థానిక రైతులకు నేరుగా మార్కెట్. 80 శాతం పండ్లు లంబసింగిలోనే అమ్ముడుపోతుండగా, మిగతా 20 శాతం మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రతి 200 గ్రాముల ప్యాకెట్‌ను రూ.100కి విక్రయిస్తూ రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న స్పెన్సర్, మోర్, రిలయన్స్ వంటి విక్రయ కేంద్రాలకూ ఇక్కడి స్టాబెరీ నేరుగా సరఫరా అవుతోంది.

**ఒక ఎకరయిపంటగా 8 నుంచి 10 టన్నులు.**

ఎకరానికి 20%-%22 వేల మొక్కలు నాటొచ్చు. అనుకూల వాతావరణం, తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా దిగుబడి కూడా అధికంగానే వస్తోంది. నేల ద్వారా వచ్చే తెగుళ్లపై తగిన జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యతతో కూడిన పంట లభిస్తుందని నిపుణుల సూచనలు.

వ్యవసాయం అంటే మక్కువ%ొ%స్టాబెరీ నా అదృష్టాన్ని మార్చింది. రాజ్ కుమార్ ఉపాధ్యాయుడు%a%గిరిజన రైతు. లంబసింగి సమీప గ్రామమైన గొందిపాకలకు చెందిన వనుము రాజ్ కుమార్ 2008లో పూణే నుంచి మొక్కలు తెచ్చి తొలి సారిగా స్టాబెరీ సాగును ప్రారంభించారు. మొదట్లో నీటి కొరతతో ఇబ్బందులు పడ్డా%ొ%వాతావరణంపై నమ్మకం కోల్పోలేదు. ఒక ఎకరంతో మొదలై%ొ%2019లో రెండు ఎకరాలకు విస్తరించి ఎంతో మంచిన లాభాలు సాధించాను. మా గిరిజన రైతుల జీవితాలు మారడానికి స్టాబెరీ పెద్ద కారణం అవుతోంది అని తెలిపారు.

**లంబసింగికి రండి%ొ%చలి, మబ్బుల్లో తందానా%ొ%తాజా స్టాబెరీకి నోరూరతే!**

ప్రతి ఏడాది వేలాదిమంది పర్యాటకులు లంబసింగి మంచు గాలుల్నీ, ఆకట్టుకునే ప్రకృతినీ ఆస్వాదిస్తారు. ఈ మధురమైన స్టాబెరీ రుచి మరింత ప్రత్యేక అనుభూతిని ఇస్తుంది. మన్యం నేల మీద పండిన ఈ అమెరికా పండు, గిరిజనుల కలలను సాకారం చేస్తోంది.















# ప్రజాదర్బార్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం డిసెంబర్ 04 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రజాదర్బార్ లో వచ్చిన వినతుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గారు చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి ఆదేశాల మేరకు అమలాపురం పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఎమ్మెల్యే గారి కార్యాలయంలో ఆయన ఈరోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై, తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా ఎమ్మెల్యే గారికి సమర్పించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా ఆలకించారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఆరోగ్యం వంటి పలు అంశాలకు సంబంధించిన 1030 అర్జీలను ఎమ్మెల్యే గారు ప్రజల నుండి స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు గారు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే మా కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకే, ఈ ప్రజా దర్బార్ ద్వారా సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. స్వీరించిన అర్జీలలో తక్షణమే పరిష్కరించదగిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. వాటి పరిష్కారం కోసం నిరంతరం పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రజా దర్బార్ కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం తన కృషి నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే ఆనందరావు గారు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి అధికారి జయవెంకటలక్ష్మిబాబ్జి, అమలాపురం పట్టణ టిడిపి అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, అమలాపురం రూరల్ మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు, కౌన్సిలర్ ఏడిద శ్రీను, ఆశెట్టి ఆదిబాబు, అబ్బాయి వెంకన్న, దిన్నా బాబు, దేవరపల్లి వీరేష్ కుమార్, గెల్లా మీనా కుమారి, మంథా ఫణి, నడింపల్లి ఉదయ బాబు, పచ్చిమాల ఏడుకొండలు, నల్లా చిట్టి, ఎమ్మార్వోలు, ఎండివోలు మున్సిపల్ కమిషనర్ మరియు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు

























తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
డిసెంబర్ 05
శుక్రవారం 2025



# భారత హాకీజట్టుకు కఠిన పరీక్ష

### నేడు క్వార్టర్స్‌లో బెల్జియంతో ఢ

### ఎఫ్ఐహెచ్ జూనియర్ ప్రపంచకప్ హాకీ




చెన్నై: ఎఫ్ఐహెచ్ జూనియర్ ప్రపంచకప్‌లో భారత యువ జట్టు కఠిన పరీక్షను ఎదుర్కోనుంది. గ్రూప్-బి టాపర్‌గా నిలిచిన భారతజట్టు శుక్రవారం జరిగే క్వార్టర్‌ఫైనల్లో బెల్జియంతో తలపడనుంది. లీగ్ దశలో గ్రూప్-బిలో 29గోల్స్‌తో టాప్‌గా నిలిచిన భారతజట్టు కోచ్ పిఆర్ శ్రీజేశ్ నేతృత్వంలో పటిష్టంగా ఉంది. లీగ్ దశలో ఓటమి ఎరుగని యువ భారత్.. మూడో, చివరి లీగ్‌లో పటిష్ట స్విట్జర్లాండ్‌ను 5-0తో చిత్తు చేసి గ్రూప్ టాపర్‌గా నిలిచింది. దిల్‌రాజ్ సింగ్ 6గోల్స్, మన్‌మీత్ సింగ్ 5గోల్స్‌తో అద్భుత ఫామ్‌లో ఉన్నారు. భారతజట్టు ప్రధాన బలహీనత పెనాల్టీ కార్నర్‌లను గోల్‌గా మలచలేకపోతోంది. శారదానంద్ తివారి గత మ్యాచ్‌లో రెండు పెనాల్టీలను గోల్స్‌గా మలిచినా.. రోహిత్, అన్మోల్ ఎక్కా సమిష్టిగా రాణిస్తేనే బెల్జియం జట్టును నిలువరించగలం. బెల్జియంతో మ్యాచ్ అంటే భారత రక్షణ శ్రేణి మరింత పెంచుకోవాల్సి ఉంది. బెల్జియం జట్టు గ్రూప్-డిలో 2వ స్థానంలో నిలిచి క్వార్టర్స్‌కు చేరినా.. టోర్నీలో స్పెయిన్ తర్వాత ప్రమాదకర జట్లలో బెల్జియం ఒకటి. బెల్జియం జట్టు గ్రూప్-డిలో 22 గోల్స్‌తో 2వ స్థానంలో నిలిచినా.. ఆ జట్టు ఫీల్డ్ గోల్స్ కంటే పెనాల్టీ కార్నర్‌ల ద్వారా చేసిన గోల్స్ ఎక్కువ. దీంతో భారత డిఫెన్స్ నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్లో అత్యత కఠిన పరీక్షను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కెప్టెన్ రోహిత్, తలెం ప్రియోబర్తా, అలీమ్ అలీ నేతృత్వంలోనే డిఫెన్స్ యూనిట్ నేడు జరిగే క్వార్టర్‌ఫైనల్లో ఏమేరకు ప్రదర్శన కనబరుస్తుందో చూడాల్సి ఉంది. బెల్జియంపై గెలవాలంటే భారత యువ హాకీ జట్టు అన్ని రంగాల్లో సమిష్టిగా రాణిచాల్సి ఉంది.

క్వార్టర్‌ఫైనల్స్..
స్పెయిన్ x న్యూజిలాండ్ మ.12.30గం౹౹లకు
ఫ్రాన్స్ x జర్మనీ మ. 3.00గం౹౹లకు
నెదర్లాండ్స్ x అర్జెంటీనా సా.5.30గం౹౹లకు
ఇండియా x బెల్జియం రా.8.00గం౹౹లకు



# ఆంధ్ర ఖాతాలో మరో గెలుపు

### సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ

ఛండీగడ్: సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు మరో విజయాన్ని నమోదు చేసుకుంది. గురువారం జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 8వికెట్ల తేడాతో ఛత్తీస్‌గడ్‌ను చిత్తుచేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఛత్తీస్‌గడ్ నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 158పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 18.5ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఆంధ్ర జట్టు బ్యాటర్లు షేక్ రషీద్(59నాటౌట్‌బీ 44 బంతుల్లో), అశ్విన్ హెబ్బర్(50బీ 40బంతుల్లో) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో రాణించారు. అంతకుముందు ఆంధ్ర బౌలర్లు యశ్వంత్(2/24), పృథ్వీ(2/35), శశికాంత్(2/36) సమిష్టిగా రాణించి ఛత్తీస్‌గడ్‌ను కట్టడి చేశారు. ఈ గెలుపుతో ఆంధ్ర జట్టు ఎలైట్ గ్రూప్-ఎలో 16పాయింట్లతో 2వ స్థానంలో నిలిచింది.

#### జమ్ముకాశ్మీర్‌పై హదరాబాద్ గెలుపు

ఇక గ్రూప్-బి స్టేజ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 4వికెట్ల తేడాతో జమ్ము కాశ్మీర్‌పై గెలిచింది. హైదరాబాద్ బౌలర్లు కట్టడిగా బౌలింగ్ చేయడంతో జమ్ము జట్టు 19.4ఓవర్లలో 112 పరుగులకే పరిమితమైంది. ఆ లక్ష్యాన్ని హైదరాబాద్ 15.1 ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. హైదరాబాద్ బౌలర్లు నితిన్ సాయి యాదవ్(3/17), మిలింద్(3/31), రక్షణ్(2/21) బౌలింగ్‌లో రాణించగా.. బ్యాటింగ్‌లో త్యాగరాజన్(50), ప్రజ్ఞరు రెడ్డి(31నాటౌట్) మెరిసారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ నితిన్ సాయి యాదవ్‌కు దక్కింది. ఈ గెలుపుతో గ్రూప్-బిలో హైదరాబాద్ జట్టు 5మ్యాచ్‌లు ముగిసేసరికి 4విజయాలతో సహా 16పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.

# రూట్ సెంచరీ.. స్టార్క్‌కు ఆరు వికెట్లు ఇంగ్లండ్ 325/9






బ్రిస్బేన్: యాషెస్ సిరీస్ (పింక్ బాల్-డే/నైట్) రెండో టెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ సంచలన బౌలింగ్‌తో మెరిసాడు. తొలి రెండు సెషన్లలో ఇంగ్లండ్ బ్యాటర్లు ఆధిపత్యం చెలయించగా.. మూడో సెషన్‌లో స్టార్క్ మెరుపు బౌలింగ్ చెలరేగాడు. చివర్లో జో రూట్ సెంచరీకి తోడు జోఫ్రా ఆర్చర్ ఇంగ్లండ్ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ జట్టు 9వికెట్ల నష్టానికి 329 పరుగులు చేసింది. రూట్(135) సెంచరీకి తోడు ఆర్చర్(32) క్రీజ్‌లో ఉన్నారు. వీరిద్దరూ చివరి వికెట్‌కు అర్ధసెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అంతకుముందు ఓపెనర్ క్రాలే(76) మాత్రమే అర్ధసెంచరీతో రాణించగా.. బ్రూక్(31), కెప్టెన్(19), జాక్స్(19) ఫర్వాలేదనిపించారు. డకెట్, పోప్, స్మిత్ డకౌట్లయ్యారు.

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌కు తొలి రోజే షాక్ తగిలింది. పెర్త్‌లో పది వికెట్లు తీసి.. బెన్ స్టోక్స్ బృందాన్ని కుప్పకూల్చిన మిచెల్ స్టార్క్(6/76) మరోసారి పర్యాటక జట్టును దెబ్బకొట్టాడు. స్టార్క్ విజృంభణతో 5 పరుగులకే 2 వికెట్లు పడిన అనంతరం క్రీజులోకి వచ్చిన జో రూట్(135 నాటౌట్ 202 బంతుల్లో 15 ఫోర్లు, ఒక సిక్సర్‌తో)తో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ జాక్ క్రాలే(76)తో కలిసి స్కోర్‌బోర్డును నడిపించిన రూట్.. 181 బంతుల్లో కంగారూ గడ్డపై మొదటి శతకం సాధించాడు. ఈ ఫార్మాట్‌లో రూట్‌కిది 40వ సెంచరీ కావడం విశేషం.

#### 264 పరుగులకే 9 వికెట్లు

క్రాలే, రూట్ ద్వయాన్ని నెసెర్ విడదీసి ఇంగ్లండ్‌ను కష్టాల్లో పడేశాడు. ఆ తర్వాత వచ్చిన హ్యారీ బ్రూక్(31)ను పెవిలియన్ పంపిన స్టార్క్.. డేంజరస్ జేమీ స్మిత్(0), విల్ జాక్స్(19), గస్ అట్కిన్సన్(4), బ్రైడన్ కార్సే(0)లను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను ఆలౌట్ అంచున నిలిపాడు. 264 పరుగులకే 9 వికెట్లు పడినా రూట్ మాత్రం పట్టువదల్లేదు. చివరి బ్యాటర్ జోఫ్రా ఆర్చర్(32 నాటౌట్) సహకారంతో జట్టు స్కోర్ 300 దాటించాడు. వికెట్ కాపాడుకుంటూ చక్కని షాట్లు ఆడిన ఆర్చర్, రూట్ హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పారు. దాంతో.. తొలిరోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 9 వికెట్ల నష్టానికి 325 పరుగుల చేసింది.

#### వాసిం అక్రం రికార్డు బ్రేక్

ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ ఒక రికార్డును బ్రేక్ చేశాడు. ఇంగ్లండ్‌తో ప్రారంభమైన పింక్‌బాల్ టెస్ట్‌లో ఆసీస్ ఎడమచేతి వాటం పేసర్ మిచెల్ స్టార్ పాకిస్తాన్ పేసర్ వాసీం అక్రం పేరిట ఉన్న ఒక రికార్డును బ్రేక్ చేశాడు. గబ్బా వేదికగా ఇంగ్లండ్‌పై తొలిరోజు ఆరు వికెట్లు తీసిన స్టార్క్.. టెస్టుల్లో సాధించిన వికెట్ల సంఖ్యను 418కు పెంచుకున్నాడు. స్టార్క్ కేవలం 102మ్యాచుల్లో 26.43సగటుతో ఇన్ని వికెట్లను పడగొట్టాడు. దీంతో ఎడమచేతి వాటం పేసర్లలో 418వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా వాసిం అక్రమ్ రికార్డును బ్రేక్ చేశాడు. వాసీం అక్రం 104 టెస్టుల్లో 414 వికెట్లు తీసి ఇంతకుముందు ఈ రికార్డును తన పేర లిఖించాడు.

#### స్కోర్‌బోర్డుశా

%ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి)క్యారీ (బి)నెసెర్ 76, డకెట్ (సి)లబూషేన్ (బి)స్టార్క్ 0, పోప్ (బి)స్టార్క్ 0, రూట్ (బ్యాటింగ్) 135, బ్రూక్ (సి)స్మిత్ (బి)స్టార్క్ 31, స్టోక్స్ (రనౌట్)ఇంగ్లిస్ 19, స్మిత్ (బి)బోలండ్ 0, విల్ జాక్స్ (సి)స్మిత్ (బి)స్టార్క్ 19, అట్కిన్సన్ (సి)క్యారీ (బి)స్టార్క్ 4, కర్సే (సి)క్యారీ (బి)స్టార్క్ 0, ఆర్చర్ (బ్యాటింగ్) 32, అదనం 9. (74ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 325పరుగులు.
వికెట్ల పతనం: 1/5, 2/5, 3/122, 4/176, 5/210, 6/211, 7/251, 8/264, 9/264.
బౌలింగ్: స్టార్క్ 19-0-71-6, నెసెర్ 14-3-43-1, బోలండ్ 19-1-87-1, డోగెట్ 14-1-76-0, గ్రీన్ 8-1-43-0.

# కోహ్లీ, రోహిత్‌ల జోలికి రావొద్దు.. రవిశాస్త్రి వార్నింగ్!

- విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలతో ఆడుకోవద్దని రవిశాస్త్రి హెచ్చరిక
- వారిద్దరూ వన్డే ఫార్మాట్‌లో దిగ్గజాలని కితాబు
- కోహ్లీ, రోహిత్‌లు ఫామ్‌లోకి వస్తే చాలామంది కనుమరుగవుతారని కామెంట్
- సెలక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఉద్దేశించే శాస్త్రి ఈ వ్యాఖ్యలు చేశారంటున్న విశ్లేషకులు




టీమిండియా సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల భవిష్యత్తుపై జరుగుతున్న చర్చపై భారత మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వారి కెరీర్‌తో ఆడుకోవాలని చూస్తున్నారంటూ కొందరికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. వన్డే ఫార్మాట్‌లో దిగ్గజాలైన కోహ్లీ, రోహిత్‌ల విషయంలో అనవసరంగా తలదూర్చవద్దని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రవిశాస్త్రి మాట్లాడుతూ... “విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేల్లో దిగ్గజాలు. అలాంటి స్థాయి ఉన్న ఆటగాళ్లతో మీరు ఆడుకోవద్దు” అని అన్నారు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ ఇద్దరి స్థానంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో శాస్త్రి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. టెస్టులు, టీ20 క్రికెట్ నుంచి ఇప్పటికే వారు రిటైర్ అయిన నేపథ్యంలో వారి ఫిట్‌నెస్‌పై చర్చ జరుగుతోంది. ఈ ఇబ్బందులు సృష్టిస్తోంది ఎవరని ప్రశ్నించగా, “కొంతమంది చేస్తున్నారు. నేను చెప్పేది అంతే. ఒకవేళ ఆ ఇద్దరి మైండ్ సెట్ కుదురుకుని, సరైన బటన్ నొక్కితే, చుట్టూ ఉన్నవాళ్లంతా కనుమరుగైపోతారు” అని ప్రభాత్ ఖబర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో శాస్త్రి ఘాటుగా సమాధానమిచ్చారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ, టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఉద్దేశించే శాస్త్రి పరోక్షంగా ఈ హెచ్చరికలు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. మ్యాచ్ ప్రాక్టీస్ లేకపోవడం వల్ల 2027 ప్రపంచకప్‌కు వారి ఎంపిక కష్టమవుతుందని విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశవాళీ వన్డే టోర్నీ అయిన విజయ్ హజారే ట్రోఫీలో ఆడాలని బీసీసీఐ సూచించగా, రోహిత్ అంగీకరించాడు. మొదట విముఖత చూపిన కోహ్లీ కూడా సెలక్టర్ల ఒత్తిడితో ఆడేందుకు ఒప్పుకున్నాడు.

# అమ్మకానికి ఆర్‌సీబీ...

### కొనుగోలు రేసులో అమెరికా సంపన్నుడు!




ఐపీఎల్‌లో అత్యంత ఆదరణ కలిగిన ఫ్రాంచైజీల్లో ఒకటైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) యాజమాన్యం మారబోతోంది. ప్రస్తుత యజమాని దయాజియో సంస్థ ఈ ఫ్రాంచైజీని విక్రయించాలని నిర్ణయించగా, అమెరికాకు చెందిన టెక్ బిలియనీర్ సంజయ్ గోవిల్ దీన్ని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ విక్రయ ప్రక్రియను 2026 మార్చి 31 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రముఖ మద్యం తయారీ సంస్థ దయాజియో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తెలియజేసింది. సంజయ్ గోవిల్ ఇప్పటికే క్రీడా రంగంలో, ముఖ్యంగా క్రికెట్‌లో అనుభవం ఉన్న వ్యక్తి. ఇంగ్లండ్‌లో జరిగే ‘ది హండ్రెడ్’ లీగ్‌లోని వెల్ష్ ఫైర్ ఫ్రాంచైజీకి, అమెరికా మేజర్ లీగ్ క్రికెట్ (%మీూజ%)లోని వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టుకు ఆయన సహ యజమానిగా ఉన్నారు. క్రికెట్ ఫ్రాంచైజీలలో పెట్టుబడులు పెట్టి, వాటిని విజయవంతంగా నడపడంలో ఆయనకు మంచి పేరుంది. ఇప్పుడు ఆయన బృందం ఆర్‌సీబీని సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై వెల్ష్ ఫైర్ ఫ్రాంచైజీ భాగస్వామి అయిన గ్లామోర్గాన్ క్రికెట్ క్లబ్ ఛైర్మన్ మార్క్ రైడర్చ్ రోబర్ట్స్ స్పందించారు. “మేము ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ ఫ్రాంచైజీలను సొంతం చేసుకుని అభివృద్ధి చేసే వ్యాపారంలో ఉన్నాం. వాటాదారులకు విలువ చేకూర్చే ఏ అవకాశాన్నైనా పూర్తిగా పరిశీలిస్తాం” అని ఓ ఆంగ్ల పత్రికతో అన్నారు. ఆయన నేరుగా ఆర్‌సీబీ పేరు ప్రస్తావించనప్పటికీ, ఈ రేసులో ఉన్నట్లు పరోక్షంగా సంకేతాలిచ్చారు. తాజా నివేదికల ప్రకారం, ఆర్‌సీబీ ఫ్రాంచైజీ విలువ దాదాపు 2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.16,800 కోట్లు) ఉంటుందని అంచనా. విరాట్ కోహ్లీ, గ్లెన్ మ్యాక్స్‌వెల్ వంటి స్టార్ ఆటగాళ్ల కారణంగా ఆర్‌సీబీకి విపరీతమైన అభిమానగణం, బ్రాండ్ విలువ ఉన్నాయి. ఈ ఏడాదే తొలిసారిగా ఐపీఎల్ టైటిల్ గెలిచిన ఆర్‌సీబీ ఫ్యాన్ ఫాలోయింగ్ ను మరింత పెంచుకుంది. ఈ విక్రయ ప్రక్రియలో భారతీయ సంస్థలతో పాటు విదేశీయులు కూడా పాల్గొనడం ఐపీఎల్ అంతర్జాతీయ ఆదరణకు నిదర్శనంగా నిలుస్తోంది.

# నేను పుట్టగానే మా నాన్న ఆ విషయం ఊహించారట!..




**కేబీసీలో హర్మన్ ప్రీత్ కౌర్**

**కేబీసీ షోలో భావోద్వేగానికి గురైన హర్మన్‌ప్రీత్ కౌర్**

**పుట్టిన రోజే తండ్రి ‘గుడ్ బ్యాటింగ్’ అని రాసిన టీ-షర్ట్ కుట్టించారు**

**ఏళ్ల తర్వాత ఆ బట్టలు చూసి ఆశ్చర్యపోయానన్న భారత కెప్టెన్**

**స్కూల్ ప్రిన్సిపాల్ ప్రోత్సాహంతోనే క్రికెట్ జట్టులోకి వచ్చానని వెల్లడి**

భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, ప్రముఖ రియాలిటీ షో ‘కౌన్ బనేగా కరోడ్‌పతి’ వేదికపై తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. మెగాస్టార్ అమితాబ్ బచ్చన్‌తో మాట్లాడుతూ, తన తండ్రి తనపై పెట్టుకున్న నమ్మకాన్ని గుర్తుచేసుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆమె పుట్టిన రోజే తన తండ్రి ‘గుడ్ బ్యాటింగ్’ అని రాసి ఉన్న ఒక ప్రత్యేకమైన టీ-షర్ట్‌ను కుట్టించారని హర్మన్‌ప్రీత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, “నేను పుట్టినప్పుడు మా నాన్న ఆఫీసులో ఉన్నారు. నేను పుట్టానని కుటుంబ సభ్యులు ఆయనకు కబురు పంపారు. నేను పుట్టిన మొదటి రోజు ధరించిన బట్టలను నాన్న ప్రత్యేకంగా తయారు చేయించారు. కొన్నేళ్ల తర్వాత మేం ఇల్లు మారుతున్నప్పుడు మా అమ్మకు ఆ బట్టలు దొరికాయి. ‘నువ్వు పుట్టినరోజు వేసుకున్న బట్టలు చూపిస్తాను రా’ అని పిలిచింది. ఆ టీ-షర్ట్‌పై ‘గుడ్ బ్యాటింగ్’ అని, చిన్న షార్ట్స్‌పై ‘గుడ్ బౌలింగ్’ అని రాసి ఉండటం చూసి ఆశ్చర్యపోయాను” అని వివరించారు. అమితాబ్ బచ్చన్ క్రికెట్‌లోకి ఎలా వచ్చారని అడగ్గా, తన ప్రయాణంలో స్కూల్ ప్రిన్సిపాల్ పాత్రను హర్మన్‌ప్రీత్ గుర్తుచేసుకున్నారు. “ఒకరోజు నేను ఆడుతుండగా మా స్కూల్ ప్రిన్సిపాల్ చూశారు. మన స్కూల్‌లో అమ్మాయిల క్రికెట్ టీమ్ లేదు, నువ్వు చేరితే ప్రత్యేకంగా ఒక జట్టును ఏర్పాటు చేస్తా అన్నారు. అలా ఆయన నా కోసం ఒక టీమ్‌ను తయారు చేయడంతో, నాకు అమ్మాయిల క్రికెట్ జట్టులో ఆడే అవకాశం దక్కింది” అని తెలిపారు.




# 'బ్యాడ్ బోయ్ కార్తీక్' నుండి 'పొమ్మంటే..' విడుదల

నాగ శౌర్య, విధి జంటగా నటిస్తున్న సినిమా 'బ్యాడ్ బోయ్ కార్తీక్'. తాజాగా ఈ చిత్రం నుండి 'పొమ్మంటే%ౌ%' అంటూ సాగే పాటను గురువారం చిత్రబృందం విడుదల చేసింది. హ్యారీస్ జైరాజ్ సంగీతం సమకూర్చిన ఈ పాటని చంద్రబోస్ రాశారు. విజరు ఏసుదాస్, శక్తిశ్రీ గోపాలన్ పాడారు. శ్రీదేవి విజయ్ కుమార్ ఈ సినిమాలో నాగశౌర్య సోదరిగా నటిస్తున్నారు. సాయికుమార్, పూర్ణ కీలక పాత్రలను పోషిస్తున్నారు. వైష్ణవి ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మితమౌతున్న ఈ సినిమాను రామ్ దేసిన (రమేష్) డైరెక్ట్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు తెలిపారు.

# ప్రముఖ సినీ నిర్మాత ఎం శరవణన్ మృతి




చెన్నై: తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ సినీ నిర్మాత ఎం శరవణన్(86) ఈరోజు తెల్లవారుజామున మృతి చెందారు. ప్రఖ్యాత ప్రొడక్షన్స్ లలో ఒకటైన ఏవిఎమ్ ప్రొడక్షన్స్ అధినేతల్లో ఆయన ఒకరు. వయోభారం కారణంగా చెన్నైలోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. తమిళ చిత్రాలతో పాటు తెలుగు, మలయాళం, హిందీ భాషల్లో అనేక చిత్రాలను నిర్మించి అభిరుచి గల నిర్మాతగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఏవిఎమ్ బ్యానర్‌పై దాదాపు 300 సినిమాలను నిర్మించారు. ఆయన భౌతికకాయాన్ని మధ్యాహ్నం 3:30 గంటల వరకు ఏవిఎమ్ స్టూడియోస్ లో సందర్శనార్థం ఉంచనున్నారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలియజేశారు.






# బాహుబలి కోసం జపాన్‌కు ప్రభాస్

బాహుబలి : ది ఎపిక్ జపాన్‌లో ఈనెల 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మేరకు నిర్మాతలు శని, ఆదివారాల్లో స్పెషల్ ప్రీమియర్స్ ఏర్పాటు చేశారు. ముందుగా ప్రకటించిన ప్రకారం జపాన్‌లో బాహుబలి : ది ఎపిక్ స్పెషల్ ప్రీమియర్‌ను వీక్షించేందుకు ఆయన హాజరవుతున్నారు. బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాత శోభు యార్లగడ్డ కూడా హాజరు కానున్నారు. సందీప్ రెడ్డి వంగా ఇప్పటికే 'స్పిరిట్' మూవీ షఉటింగ్ మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ప్రభాస్, తృప్తి డిమ్రిపై వచ్చే కొన్ని సన్నివేశాలను కూడా ఇటీవలే షఉట్ చేశారు. జపాన్ నుంచి తిరిగి రాగానే మళ్లీ షఉటింగ్‌లో పాల్గొంటారు. మారుతి-ప్రభాస్ కాంబోలో తెరకెక్కిన రాజాసాబ్ వచ్చే ఏడాది జనవరి 9న విడుదల కానున్నది.

# నేను ఎవరి సానుభూతి కోసం పాకులాడటం లేదు' : శ్యామాలి



హైదరాబాద్ : ' నేను ఎవరి సానుభూతి కోసం పాకులాడటం లేదు ' అని దర్శకుడు రాజ్ నిడిమోరు మాజీ భార్య శ్యామాలి ఇన్‌స్టా వేదికగా పేర్కొన్నారు. గురువారం ఆమె ఓ పోస్టును పెట్టారు. " నాపై ప్రేమాభిమానాలు చూపుతున్న అందరికీ కృతజ్ఞతలు. మీ అందరి ఆశీర్వాదాలు నాకు అందుతున్నాయి. కానీ, నేను ప్రస్తుతం ఎలాంటి విషయాల గురించి పట్టించుకునే పరిస్థితుల్లో లేను. ఎందుకంటే మా గురువు క్యాన్సర్ బారినపడినట్లు ఇటీవల తెలిసింది. నేను ఆయన కోసం ప్రార్థిస్తున్నాను. నాకు ఎలాంటి పీఆర్ టీమ్ లేదు. నా సోషల్ మీడియా ఖాతాలను నేనే మెయిన్‌టెన్ చేస్తాను. నేను మా గురువు గురించి ఆలోచిస్తూ నిద్ర లేని రాత్రులు గడుపుతున్నా. ఆ కారణంగా మీ అందరికీ స్పందించలేను. నా బాధను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. నా నుంచి ఎలాంటి బ్రేకింగ్ న్యూస్‌లు ఆశించకండి. మీడియా వారు నాపై సానుభూతి చూపాల్సిన అవసరం లేదు. అందరూ సంతోషంగా ఉండాలని నేనెప్పుడూ కోరుకుంటాను " అని తన పోస్టులో శ్యామాలి పేర్కొన్నారు. హీరోయిన్ సమంత, బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరు డిసెంబర్ 1 న కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో ఉన్న లింగభైరవి దేవాలయంలో వివాహం చేసుకున్న సంగతి విదితమే.

# అఖండ-2 ప్రీమియర్ షోలు రద్దు...

**అభిమానులకు క్షమాపణలు చెప్పిన 14 రీల్స్ ప్లస్**
**ఓవర్సీస్ ప్రీమియర్లు షెడ్యూల్ ప్రకారమే ప్రదర్శన**



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న పాన్ ఇండియా చిత్రం 'అఖండ-2: తాండవం'కు ఆరంభంలోనే చిన్న అవాంతరం ఎదురైంది. ఈ రోజు (డిసెంబర్ 4) భారత్‌లో జరగాల్సిన స్పెషల్ ప్రీమియర్ షోలను రద్దు చేస్తున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ ప్రకటించింది. సాంకేతిక సమస్యల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు 14 రీల్స్ ప్లస్ సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. "సాంకేతిక కారణాల వల్ల ఇండియాలో ఈ రోజు జరగాల్సిన ప్రీమియర్ షోలను రద్దు చేస్తున్నాము. మా వంతు మేం ఎంతగానో ప్రయత్నించాం, కానీ కొన్ని అంశాలు మా నియంత్రణలో ఉండవు. అసౌకర్యానికి క్షమించండి" అని పోస్టులో పేర్కొంది. అయితే, ఓవర్సీస్‌లో మాత్రం ప్రీమియర్ షోలు యథావిధిగా షెడ్యూల్ ప్రకారమే ప్రదర్శితమవుతాయని స్పష్టం చేసింది. బ్లాక్‌బస్టర్ హిట్ అయిన 'అఖండ' చిత్రానికి సీక్వెల్‌గా 'అఖండ-2' వస్తుండటంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ప్రీమియర్ షోల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానులు ఈ రద్దుతో కాస్త నిరాశకు గురయ్యారు. అయితే, ముందుగా ప్రకటించినట్లుగానే డిసెంబర్ 5 నుంచి ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. ఈ ప్రీమియర్ల రద్దు సాధారణ ప్రదర్శనలపై ఎలాంటి ప్రభావం చూపబోదని తెలుస్తోంది.

# మెగా ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..

## 'మన శంకరవర ప్రసాద్' నుంచి మరో పాట రెడీ

**మెగాస్టార్ 'మన శంకరవర ప్రసాద్' నుంచి రెండో పాట ప్రకటన**


**ఈ నెల 8న 'శశిరేఖ' పాట విడుదల**

**ఈ నెల 6న పాట ప్రోమో రిలీజ్**

**ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా నిలిచిన 'మీసాల పిల్ల' సాంగ్**

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం 'మన శంకరవర ప్రసాద్' (MSG) నుంచి చిత్ర బృందం మరో కీలక అప్‌డేట్‌ను విడుదల చేసింది. ఇప్పటికే విడుదలైన తొలి పాట 'మీసాల పిల్ల' చార్ట్‌బస్టర్‌గా నిలిచి సంగీత ప్రియులను అలరిస్తుండగా, తాజాగా రెండో పాట విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. 'శశిరేఖ' పేరుతో రానున్న ఈ రెండో పాటను ఈ నెల 8న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. దీనికి రెండు రోజుల ముందుగా అంటే ఈ నెల 6న ఈ పాటకు సంబంధించిన ప్రోమోను అభిమానుల ముందుకు తీసుకురానున్నారు. తొలి పాట సృష్టించిన ప్రభంజనంతో రెండో పాటపై అంచనాలు భారీగా పెరిగాయి. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మెగాస్టార్‌తో పాటు విక్టరీ వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా వంటి అగ్ర తారలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల, వి. హరికృష్ణ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో బాణీలు అందిస్తున్నారు. ఇలా భారీ తారాగణం, ప్రముఖ సాంకేతిక నిపుణులతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# రెస్టారెంట్ పెడతా.. నాన్నను చూసుకుంటా' : ఇమ్మడి రవి




హైదరాబాద్ : ఐ బొమ్మ, బప్పం పేర్లతో వెబ్ సైట్లను ఏర్పాటు చేసి, 21 వేల సినిమాలను పైరసీ చేసిన ఇమ్మడి రవి అరెస్టు సంగతి విదితమే. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఓ రెస్టారెంట్ ఏర్పాటు చేసి వినియోగదారులకు షడ్రుచుల ఆహార పదార్థాలను విక్రయించాలని ఆలోచిస్తున్నట్లు, అలాగే ఒంటరిగా ఉన్న తన తండ్రిని జాగ్రత్తగా చూసుకోవాలని కోరుతున్నట్లు రవి తన నిర్ణయాన్ని పోలీసులకు వెల్లడించాడు. హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసుల విచారణలో రవి ఇదే విషయాన్ని స్పష్టం చేశాడు. ఇమ్మంది రవిపై హైదరాబాద్‌లో మొత్తం ఐదు కేసులు నమోదయ్యాయి.

**అతడిలో ఎంతో మార్పు కనిపిస్తోంది : సైబర్ క్రైం పోలీసులు**

మొదట ఓ కేసులో రవిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టు అనుమతితో ఓసారి కస్టడీకి, మరోసారి అదనపు కస్టడీకి తీసుకున్నారు. ఆపై మరో కేసులో అరెస్టు చేయడానికి అనుమతి కోరుతూ న్యాయస్థానంలో ప్రిజనర్స్ ట్రాన్సిట్ వారెంట్ కోసం పిటిషన్ వేస్తున్నారు. ఇలా ఇప్పటివరకు రెండు కేసుల్లో ఈ విధానాన్ని పూర్తి చేసిన సైబర్ క్రైం పోలీసులు మిగిలిన మూడు కేసుల్లోనూ ఇదే ప్రక్రియను అనుసరించడానికి సన్నాహాలు చేస్తున్నారు. తొలిసారి అరెస్టు చేసిన నాటికి, ఇప్పటికి అతడిలో ఎంతో మార్పు కనిపిస్తోందని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు.

**బతుకు తెరువు కోసం రెస్టారెంటు పెడతా .. నాన్నను జాగ్రత్తగా చూసుకుంటా : రవి**

తమకు చిక్కినప్పుడు సినిమా టికెట్ల రేట్లు, హీరోల రెమ్యూనరేషన్ల విషయాలు మాట్లాడి, తన పనిని సమర్థించుకున్నాడని, ప్రస్తుతం పైరసీ సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని నిర్ణయించుకున్నట్లు రవి చెబుతున్నాడని అధికారులు తెలిపారు. బతుకు తెరువు కోసం హైదరాబాద్ లేదా తన స్వస్థలమైన విశాఖపట్నంలో రెస్టారెంట్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు పోలీసులతో రవి తెలిపాడు. తన తప్పు తెలుసుకున్న రవి తన తండ్రి చిన అప్పారావు వద్దకూ వెళ్లాలని భావిస్తున్నట్టు పోలీసులతో చెప్పాడు. భార్య నుంచి దూరమైన నాటి నుంచి అతడు ఒంటరిగానే జీవిస్తున్నాడు. ప్రస్తుతం తాను ఇక్కడ, తండ్రి అక్కడ ఒంటరి జీవితం గడుపుతున్నామని విచారం వ్యక్తం చేస్తున్నాడు. తన తల్లి నుంచి దూరంగా అనారోగ్యంతో బతుకుతున్న తండ్రిని జాగ్రత్తగా చూసుకుంటానని పోలీసులకు రవి చెప్పాడు.

# అఖండ 2' రిలీజ్ వేళ.. టిక్కెట్ల ధరలు పెంపు ..!

హైదరాబాద్ : నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ 2' చిత్రం రేపు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో బాలయ్య మరోసారి ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు, టీజర్లు, ట్రైలర్ అన్నీ కలిసి సినిమాపై విశేషమైన హైప్‌ను సృష్టించాయి. ఇంతకుముందు బాలకృష్ణ-బోయపాటి కాంబినేషన్‌లో వచ్చిన 'సింహ', 'లెజెండ్', 'అఖండ' అన్ని మూడు బ్లాక్‌బస్టర్ హిట్స్. అఖండ తరువాత బాలయ్య చిత్రాల వసూళ్లు రూ.50 కోట్ల నుండి నేరుగా రూ.100 కోట్ల మార్క్ దాటాయి. అఖండతో తొలి సారిగా 100 కోట్ల క్వాలిటీ క్లబ్‌లోకి అడుగుపెట్టిన ఆయన, అనంతరం 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి', 'డాకూ మహారాజ్' చిత్రాలతో వరుసగా నాలుగు సినిమాలు శతకోట్ల వసూళ్లు సాధించిన సీనియర్ హీరోగా రికార్డు సృష్టించారు. ఇప్పుడు విడుదలకు సిద్ధమైన 'అఖండ 2' కూడా భారీ విజయాన్ని అందుకుంటుందని అభిమానులు విశ్వాసంగా చెబుతున్నారు. ఇదిలా ఉండగా, సినిమా రిలీజ్‌కు ముందే తెలంగాణ ప్రభుత్వం ఓ వార్త చెప్పింది. రేపటి ప్రీమియర్ల కోసం సినిమా టికెట్ రేట్లను పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ రోజు రాత్రి 8 గంటల నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం అవుతున్నాయి.

ప్రీమియర్ షోలు : రూ. 600

సింగిల్ స్క్రీన్‌లు : అదనంగా రూ. 50

మల్టీప్లెక్స్‌లు : అదనంగా రూ. 100

ఈ ధరలు మూడు రోజులపాటు మాత్రమే అమల్లో ఉంటాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అఖండ 2 కోసం టికెట్ ధరల పెంపుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. స్పెషల్ షో టికెట్ ధరను రూ. 600గా నిర్ణయించింది. సింగిల్ స్క్రీన్‌ల్లో రూ. 75 పెంపు, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపును ఆమోదించింది. డిసెంబర్ 5న చిత్రం విడుదలైన తర్వాత ఏపీలో పెంచిన ఈ టికెట్ ధరలు మొదటి పది రోజుల పాటు కొనసాగుతాయి.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339